
Volume IV - Issue VI
June 2021


# విద్యార్థి వెలుగు



## సాహిత్యం

సంపాదకీయం

# బంధించబడలేని సాహిత్యం



ఏప్రిల్ 1963లో, డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ను అనుమతి లేకుండా బహిరంగ ప్రదర్శనకు నాయకత్వం వహించాడనే ఆరోపణలపై అలబామాలోని బర్మింగ్‌హామ్ జైలుకు తరలించారు. తొమ్మిది రోజుల శిక్ష సమయంలో కింగ్ వార్తా పత్రికల అంచులను, టాయిలెట్ (టిష్యూ) పేపర్లు ఉపయోగించి బర్మింగ్‌హామ్ మతాధికారుల బృందానికి తన ప్రతిస్పందనను తెలియజేసాడు. "లెటర్ ఫ్రమ్ బర్మింగ్‌హామ్" గా అనేక ప్రచురణలలో ముద్రించబడిన ఆ పత్రిక దేశాన్ని ఎంతో ప్రభావితం చేసి అమెరికన్ పౌర హక్కుల ఉద్యమానికి ఒక టచ్‌స్టోన్‌గా మారింది.

ఎక్కడైతే మాట్లాడడానికి, భావాలను స్వేచ్ఛగా ప్రకటించడానికి అఘాతం ఏర్పడుతుందో, అలాంటి సమయాలలో ప్రజలను చైతన్య పరచడానికి, సందేశమివ్వడానికి చేరువకాగలిగేదే సాహిత్యం. యిర్మీయా ప్రవక్త చెరసాలలో వేయబడినప్పుడు, దేవుడు చెప్పిన మాటలను లేఖికుడైన బారాకుతో వ్రాయించి రాజుకు, అధికారులకు తెలియజేస్తాడు. అయితే రాజు వాటిని విన్న తరువాత పశ్చాత్తాపపడకుండా కాగితపు చుట్టలను కాల్చివేస్తాడు. మరలా యిర్మీయా వాటిని తిరిగి వ్రాయిస్తాడు. అత్యధిక పత్రికలు వ్రాసిన అపొస్తులుడైన పౌలు కూడా సువార్త సత్యాలను, క్రైస్తవ సిద్ధాంతాలను సాహిత్యం ద్వారా అప్పుడున్న ప్రజలకు తెలియజేస్తాడు. ఆయన రోమ్‌లో గృహ నిర్బంధంలో ఉన్నప్పుడు ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు, ఫిలేమోనుకు పత్రికలు రాశాడు. "ప్రిసన్ ఎపిసిల్స్" గా పిలువబడే ఈ పత్రికలు నేటికీ మన అనుదిన క్రైస్తవ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ప్రియుడైన యోహాను పత్మాసు ద్వీపం నుండి ఎంతో అద్భుతమైన ప్రవచనాత్మక ప్రకటన గ్రంథాన్ని రాశాడు. గొప్ప గొప్ప నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, క్రైస్తవ ధీరులు జైల్లో ఉన్నప్పుడు గొప్ప రచనలను చేశారు. రెండు వందలకు పైగా భాషలలోకి తర్జుమా చేయబడిన సుప్రసిద్ధ క్రైస్తవ ఉపమానాత్మక నవల 'యాత్రికుని ప్రయాణం' కూడా బోధకుడైన జాన్ బన్యన్ జైల్లో ఉన్నప్పుడే అక్షరరూపం దాల్చింది. చరిత్రలో ఎన్నడూ లాకప్ కానీ, గృహ నిర్బంధం కానీ సాహిత్యానికి అవరోధం కాకపోగా మౌఖికంగా సంభాషించడానికి అనువుగా లేనప్పుడు ప్రజలను చేరువ చేసింది సాహిత్యమే.

సాహిత్యం ప్రజల హృదయాలను లోతుగా కదిలించి, తన గురించి, సమాజం గురించి ఆలోచింప జేస్తూ గొప్ప మార్పుకు నాంది పలికే అక్షర కుసుమం. మనసుకు ఉల్లాసాన్ని, సంతోషాన్ని కలిగిస్తూ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ముఖ్యమైన సమస్యలను అర్థం చేసుకొనే ఆలోచనా సామార్థ్యానికి, ఊహా పటిమకు సాహిత్యం ఎంతగానో దోహదపడుతుంది. సౌవార్తీకరణలో భాగంగా ఇతరుల భావాలను అర్థం చేసుకోవడానికి, వారిని చేరుకోవడంలో అవలంభిస్తున్న నూతన పంథాలను తెలుసుకోవడానికి సాహిత్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులలో సువార్తను బహిరంగంగా ప్రకటించలేని స్థితిలో ఉన్న మనకు సాహిత్యం ఓ మాధ్యమం. పరిశుద్ధాత్మ దేవుని సహాయంతో సువార్త సత్యాన్ని తెలియజేసే కవితలు, పాటలు, క్లుప్త నిడివి గల వీడియోలలో సందేశాలను తెలియజేసే రచనలు మొదలగు వాటిని రచించడానికి ఇది అనువైన సమయం. ఇలా ఎన్నో విషయాలు అక్షరరూపం దాల్చడానికి ఈ సమయాన్ని వినియోగిద్దాం. మనం చేపట్టే రచనలు నిరాశ, నిస్పృహలలో ఉన్న విద్యార్థులకు, ప్రజలకు వెలుగునివ్వాలని, తోటి విశ్వాసులను చైతన్యపరచాలని ప్రార్థిద్దాం. ప్రభువు అట్టి కృపను మనందరికీ ప్రసాదించును గాక!

– కె. జాన్ భూషణం, మేనేజింగ్ ఎడిటర్

**JUNE 2021**
**VIDYARTHI VELUGU**
A publication of the UESI-TS Publication Trust

# విషయ సూచిక

| | |
|---|---|
| సాహిత్యపు పిలుపు సమాజానికి వెలుగు | 4 |
| The Importance of Reading | 7 |
| తెలుగు క్రైస్తవ సాహిత్య చరిత్ర మరియు ఆవశ్యకత | 10 |
| యోకెబెదు | 16 |
| ఆధ్యాత్మికంగా, మానసికంగా వికసించుటకు దేవుడు కృప చూపించాడు | 22 |
| విలియం కేరీ | 24 |
| అందరూ బాగుండాలి అందులో మనముండాలి | 29 |

## EDITORIAL BOARD

Editor and Publisher:
Mr. Sudhir Kumar Gaddam, Hyderabad.
Managing Editor:
Mr.K.John Bhushanam, Hyderabad.
Litt. Dept. Secretary: Mr.Nani Babu, Hyderabad.
**Members:**
Dr. Mercy Sujatha, Hyderabad.
Mrs. Ruth Vinay, Rangareddy.
Mr. Michael Fernandez, Hyderabad.
Mr. Simon, Hyderabad.
Mr. Enoch.Y., Khammam.

## UESI-TS Account Details

Name - UESI-TS
Bank - State Bank of India
A/C No - **35233350086**
Branch - Bowrampet
IFSC code - SBIN0020437
Kindly inform the office after depositing amount to Ph. 7386598974

## VV & LITERATURE Account Details

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - East Maredpally, Secunderabad
IFSC code - CNRB0000624
Kindly inform the office after depositing amount to Ph. 9491595765

**Note:** This account is only for VV & Literature purchases

Themes for
**July'21 : Discipleship**
**Aug'21 : True Security (Evangelism Related)**

**Note: Please send your write-ups on or before 15th of every month to editorvv2018@gmail.com**

# పాఠకుల స్పందన....

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన....** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు



*"The world does not need more Christian literature. What it needs is more Christians writing good literature."*

*- C.S.Lewis*

సాహిత్యం స్పెషల్



# సాహిత్యపు పిలుపునందుకుని

– ఆర్. ప్రభుదాస్ (RPD)

**తె**లుగువారి తొలి ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు (1952), తెలంగాణ ముద్దుబిడ్డ, భారత దేశ ప్రధాని శ్రీ పి.వి. నరసింహా రావు (1991) గార్లు బహుభాషా కోవిదులు. అనేక కవితలు, గ్రంథాలను రచించి, కొన్నింటిని మాతృభాషలోనికి అనువదించి ప్రజలకు భావ వెలిగింపునిచ్చిన మహానుభావులు వీరు. హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లోనున్న శ్రీ కృష్ణ దేవరాయ భాషానిలయం ద్వారా సురవరం ప్రతాప రెడ్డి, మాడపాటి హనుమంత రావు మున్నగు వారి గ్రంథ రచనలు, శతక వాఙ్మయము ప్రజలను చైతన్యవంతులను చేశాయనుటలో అతిశయోక్తి ఎంతమాత్రము లేదు. అంతవరకు ఎందుకు? ప్రత్యేక తెలంగాణ సాధనలో సాహిత్యం ప్రత్యేక పాత్ర పోషించిన సంగతి మనందరికీ తెలిసిందే.

సాధారణంగా సాహిత్యమంటే రచనలు చేసే కళ లేదా అక్షరాల సాన్నిహిత్యంతో చేసే సందేశాత్మక కళ అని అంటారు. గద్యం, పద్యం, వ్యాసం, పరిశోధన పత్రం, కవిత, కథానిక, నాటకం, పాట మొదలైనవన్నీ వివిధ సాహిత్య ప్రక్రియలు. సాహిత్యం సమాజానికి దిక్సూచి లాంటిది – దిశానిర్దేశం చేస్తుంది. ఇట్టి సాహిత్యం ప్రజలను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకొందాం.

**సాంస్కృతిక వెలిగింపు:** ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకొని నాటి సమాజంలో పాతుకుపోయిన బాల్య వివాహాలు, కన్యాశుల్కం, సతీ సహగమనం, వేశ్యాలోలత్వం, అంటరానితనం, లంచగొండితనం మున్నగు సామాజిక రుగ్మతలను కూకటి వేళ్ళతో పెకలించటానికి తనవంతు ప్రయత్నం చేశారు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు. స్వంత వారు తనను వెలివేసినా భయపడలేదు. తెలుగు నవలా సాహిత్యానికి మకుటమైన రాజశేఖర చరిత్రను వ్రాసి నాటి జమిందారీ విధానాన్ని, కుల వ్యవస్థను, బానిసత్వాన్ని ప్రశ్నించారు. తను కలలుకన్న సమసమాజ స్థాపనకు ముఖ్యంగా విద్యార్థులను ఉద్యమకారులుగా నడిపించి, సమాజాన్ని వెలుగుబాటలో నడిపించారు. శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా వంటి ప్రముఖులు తమ రచనలద్వారా సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి సమాజాన్ని చైతన్యపరచారు.

**శాస్త్రీయ వెలిగింపు:** మానవ జీవన విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన 'చక్రము' క్రీ.పూ. 3500లో మెసపొటేమియాలో ఆవిష్కరించబడినట్లు ఆధారాలున్నాయి. విద్యుత్ దీపాన్ని ఆవిష్కరించిన థామస్ ఆల్వా ఎడిసన్, గురుత్వాకర్షణను కనిపెట్టిన సర్ ఐజక్ న్యూటన్, శక్తి నిత్యత్వ సూత్రాన్ని కనిపెట్టిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, '0' ని ప్రపంచానికి పరిచయం చేసిన ఖగోళ శాస్త్రజ్ఞుడు ఆర్యభట్టలు మానవాళికి ఎంతో మేలు చేశారు. ఇక వైద్యరంగంలోని పరిశోధనలు అపూర్వమైనవి. మొట్టమొదటి యాంటీబయోటిక్ పెనిసిలిన్‌ను కనిపెట్టిన అలెగ్జాండర్ ఫ్లెమింగ్, ఎందరో చక్కెర వ్యాధిగ్రస్తుల ప్రాణాలను కాపాడే ఇన్సులిన్‌ను తయారుచేసిన సర్ ఫ్రెడరిక్ బాంటింగ్, మశూచిని శాశ్వతంగా దూరంచేసిన టీకా కనిపెట్టిన ఎడ్వర్డ్ జెన్నర్ మన ప్రాణదాతలు. ఈ మహానుభావులు తమ ఆవిష్కరణలను అక్షరరూపంలో పెట్టి అందరూ అర్థం చేసుకునే విధంగా భద్రపరిచారు. ఆయుర్వేద వైద్య పితామహుడైన చరకుడు 'చరక సంహిత' గ్రంథంలో ఆయుర్వేద వైద్య విధానాలను పొందుపరచాడు.

> “ మహానుభావుల ఆవిష్కరణలు మనకు ఎంతో మేలు చేసేవైతే వాటిని సామాన్య మానవుని దగ్గరకు చేర్చింది మాత్రం సాహిత్యమే.

ప్రాణుల మనుగడకు సంబంధించి ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన 'జీవ పరిణామ సిద్ధాంతం' ఎందరినో ఆలోచింపజేసింది. యు.ఇ.యస్.ఐ. పితామహుడు ప్రొఫెసర్ ఇనాక్ గారు రచించిన 'జీవ పరిణామమా – దైవ సృష్టియా' ప్రపంచ ప్రఖ్యాతినొందింది. ఈనాడు మనం ఎంజాయ్ చేస్తున్న డిజిటల్ ప్రపంచానికి పునాది ఛార్లెస్ బాబేజ్‌గారి ఆవిష్కరణయైన కంప్యూటరే. ఈ మహానుభావుల ఆవిష్కరణలు మనకు ఎంతో మేలు చేసేవైతే వాటిని సామాన్య మానవుని దగ్గరకు చేర్చింది మాత్రం సాహిత్యమే.

**రాజకీయ వెలిగింపు:** ఆహారం కావాలని అడిగిన ప్రజలకు 'వెళ్ళి గడ్డి మేయండి' అని సమాధానమిచ్చిన ఫ్రాన్స్ దేశపు రాజైన 14వ లూయిని గద్దె దింపి, భూమిమీద పుట్టిన ప్రతి మనిషికి కావలసింది స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని చెప్పి విప్లవం ద్వారా విజయం సాధించటానికి ఒక కారణం నాటి తత్వవేత్తల రచనలు, ముఖ్యంగా రూసో వ్రాసిన 'సోషల్ కాన్‌టాక్ట్ థియరీ'. మనిషి స్వేచ్ఛగా జన్మించాడు గాని అన్ని చోట్ల సంకెళ్ళతో బంధింపబడియున్నాడని చెప్పారు. ఫ్రెంచ్ విప్లవం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని మానవాళికి అందించింది. 'దేశమును ప్రేమించు మన్నా – మంచియన్నది పెంచుమన్నా' అన్న గురజాడ వారి సాహిత్యం, ఆనాటి ప్రజలలో దేశభక్తిని రేకెత్తించింది. ఇలా అనేకమంది సాహితీవేత్తలు తమ రచనల ద్వారా స్వాతంత్రోద్యమంలో పాల్గొనేలా ప్రజలను పురికొలిపారు.

“ ఆన్‌లైన్‌లో కావలసిన సమాచారం ఒక క్లిక్ దూరంలో ఉన్నప్పటికీ, పుస్తకరూపంలో ఉన్న సాహిత్యం విలువ ఎంతో ఉన్నతమైనది.

**ఆర్థిక వెలిగింపు:** కార్ల్ మార్క్స్ తాను వ్రాసిన Das Kapital పుస్తకం ద్వారా నాటి బూర్జువా విధానాన్ని ప్రశ్నించి శ్రామికులే రాజులు అన్న సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. అలాగే మావో వ్రాసిన Red Book చైనాలో కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని తీసుకొచ్చింది. తద్వారా సోషలిజం (ఆర్థిక సమానత్వం) ముఖ్యమని సమాజాన్ని చైతన్య పరచారు. ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించిన ప్రతి ఒక్కరికీ తెలిసిన The law of Supply and Demand మార్కెట్‌లో వస్తువులు, సేవల డిమాండ్‌ను బట్టి ఉత్పత్తుల ధరలు ఏవిధంగా ఉంటాయో, సప్లై డిమాండ్‌ల మధ్య సమతుల్యత ఎప్పుడు ఉంటుందో తెలుసుకోవచ్చు.

**ఆధ్యాత్మిక వెలిగింపు:** సాహిత్యం ద్వారా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో అనేక మార్పులు వచ్చాయి. ఐతే అన్నిటికంటే ముఖ్యంగా దైవ ప్రేరితమైన ఏకైక వాఙ్మయం బైబిల్ (పరిశుద్ధ గ్రంథం) మానవాళి మనో నేత్రాలు వెలిగించి అన్ని విధాలుగా, అన్ని రంగాలలో మార్పు తీసుకు రావటమేకాక విశ్వసించిన ప్రతి ఒక్కరికి నిత్యజీవం, పరలోక భాగ్యం, దేవునితో సంబంధం, తోటి మానవునితో అనుబంధం తీసుకువచ్చింది. నేడు ప్రపంచ ప్రజానీకానికి కావలసింది రక్షకుడైన క్రీస్తు, తన భక్తులు వ్రాసిన క్రైస్తవ సాహిత్యమే. John Wicliff, Polycarp, John Bunyan మున్నగువారు తమ ప్రాణాలనైనా కోల్పోవడానికి ఇష్టపడ్డారు కానీ వారి రచనలు వెనుకకు తీసుకోలేదు. నేటికీ వారి రచనలు అందరికి వెలిగింపునిస్తూనే ఉన్నాయి. విలియం కేరీ రచించిన An Enquiry into the Obligations of Christians అనే పుస్తకం ద్వారా అనేకమంది క్రైస్తవులు ప్రభావితులై ప్రపంచమంతా మిషనరీలుగా వెళ్ళి అనేక దేశాలను సువార్త వెలుగుతో నింపారు.

> “ The best book is not one that informs merely, but one that stirs the readers up to inform himself - A.W.Tozer

నేడు 'భారతదేశం వెలిగిపోతోంది' అని మనం గర్వంగా చెప్పుకొంటున్నామంటే దానికి కారణం – ప్రింటింగ్ ప్రెస్‌ను ఇండియాకు తెచ్చి అనేక పుస్తకాలు ముద్రించి సాహిత్య వెలిగింపునిచ్చిన కీర్తి విలియం కేరీకే దక్కుతుంది.

**క్రైస్తవ సాహిత్య ప్రత్యేకతలు:**

1. పరమ దేవునిచే అంగీకరింపబడినది
2. సర్వ మానవాళిని సత్య పథంలో నడిపించే సత్యాయుధం
3. దేవుని ఆశీర్వాదాలను పంచే పనిముట్టు
4. వ్యక్తులను క్రీస్తు స్వారూప్యంలోనికి మార్చుటానికి సహాయపడే సహకారి
5. సాతాను పన్నాగాలను అడ్డగించే డాలు
6. మానవాళి దేవుని చేరుటకు మార్గాన్ని చూపించే మార్గదర్శి

పరిశుద్ధ వాక్యపు వెలుగులో నాటి క్రైస్తవ సంఘపు పోకడలను ఖండిస్తూ, మార్టిన్ లూథర్ 95 మత సూత్రాలను వ్రాసి తలుపుకు అంటించి సంఘ దిద్దుబాటుకు కారకుడయ్యాడు. ప్రతి క్రైస్తవుడు క్రైస్తవ సాహిత్యాన్ని పంచాలని జాన్ వెస్లీ (18వ శతాబ్దం) చేసిన హెచ్చరికను మనసున ముద్రించుకొని ఛార్లెస్ స్పర్జన్, బిల్లీ గ్రాహం, జార్జి వెర్వర్ లాంటి భక్తులు క్రైస్తవ సాహిత్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చారు. తమ పాటలు, మాటల ద్వారా తెలుగు రాష్ట్రాలలో ఎందరినో క్రీస్తు మార్గంలో నడిపించిన పురుషోత్తమ చౌదరి, బేతాళ జాన్, జక్కి దేవరాజు, ఆర్.ఆర్.కె.మూర్తి, బ్రదర్ భక్తసింగ్, జాక్ పూనన్, జి. రాజారావు మొదలైనవారు చిరస్మరణీయులు.

సాహిత్య పఠన, రచన, ఇతరులకు క్రైస్తవ సాహిత్యాన్ని పరిచయం చేయటం, వారు చదివేలా ప్రోత్సహించటం సాహిత్య సేవలో పాలుపొందటమే. ఆన్‌లైన్‌లో కావలసిన సమాచారం ఒక క్లిక్ దూరంలో ఉన్నప్పటికీ, పుస్తకరూపంలో ఉన్న సాహిత్యం విలువ ఎంతో ఉన్నతమైనది. మనముందున్న గొప్ప దైవ భక్తుల స్ఫూర్తితో మారుమనసు పొందిన భారతీయ క్రైస్తవులుగా, ముఖ్యముగా యుఇయస్ఐకు చెందిన విద్యార్థులంగా, గ్రాడ్యుయేట్స్‌గా సాహిత్య పిలుపునందుకుని మన దేశాన్ని వెలిగిద్దాం. దీవెనలు అందిద్దాం. ఆమేన్!! •

హబ 2:2, ద్వితీ 5:22, 1 యోహా 1:4, 2 థెస్స 3:17, యోహా 1:1; 12:46, 2 కొరింథీ 4:4

**ఆర్. ప్రభుదాస్ (RPD), రిటైర్డ్ హిస్టరీ లెక్చరర్, తెనాలి.**

Literature Special

# The IMPORTANCE of Reading



By JOHN SUKUMAR

Reading is hard work. It requires discipline. Though no one would discredit its importance, many find it hard to follow the discipline of reading. A world filled with ever-increasing noises, pictures and videos doesn't make it easier. Many Christians find it hard to sit down with a book, take time to read it, chew on it and digest the best of it. Perhaps, the reasons could be not having a theology of reading, or an understanding of the process of reading or a practical know-how of where to start and how to start. Yet, of all people, Christians need to practise the discipline of reading for they are called to be a reading people.

God revealed himself not only in the person of Jesus Christ but also in 'Written Revelation'. It all started some 3500 years ago on the top of a dry, dusty, red mountain in an Egyptian desert called Mt.Sinai. It was an earth-shattering, heaven-bending event when the finger of God etched his words on stone tablets. It was the beginning of all publishing industry. The subsequent revelation of God was written and recorded to be read by all his people in the generations to come. The Israelites came to be known as the 'people of the Book'. But it is a known fact that printed bibles in book shelves don't make people know God. The minds of earthly people are blinded to spiritual truths and unless the light of the Gospel of the incarnate 'Word' shines in people's hearts, the 'inspired Word' doesn't become effective. Thus, Christians are called to be a people who read their Bibles primarily and books by Christian and non-Christian authors with a mind transformed by the Gospel. David in Psalm 36:9 says, "..**In your light, we see light**." Besides, having **a theology of reading**, it is also important to understand the reading process.



**"Knowing how to read a book doesn't make us readers unless we practise it.**

Reading is a complicated activity. It is active use of one's senses along with the skills needed to process information. Just like a fielder on a cricket ground who anticipates and reaches out to the ball hit by a batsman, the reader needs to be active to find the author's cues. Mortimer Adler in his book, *How to read a Book*, suggests that there are three types of reading: Reading for Entertainment (magazines, whatsapp chats, social media posts etc)

Reading for Information (newspapers, reports etc), Reading for Understanding (reading, analysing and interpreting a book). The third type of reading is challenging but it surely expands our horizons, informs our intellect and illuminates our minds. It involves understanding the structure of a book - discovering the unity(theme) and complexity (major parts) and understanding the synthesis of a book- important words/ terms, author's propositions and arguments to prove them. Yet, knowing how to read a book doesn't make us readers unless we practise it.

The starting point is **'Make time to read'**. John Piper says that if you read for just 15 minutes a day, even if you read slowly, you'll get through 20 books a year. Tim Challies points out that even if you only read in the bathroom, you can get through a book or two a year. Start small. Resolve to read ten books a year. Focus primarily on reading your Bible and pick a few books. Try reading from godly authors like J.I.Packer, John Piper, R.C. Sproul, Tim Keller, or if you really want to be stretched try reading anything by John Owen or Jonathan Edwards. Secondly, **Choose your books** based on 'why you are reading them'. Books can be segregated as Books that sharpen our thinking (doctrinal/ apologetic etc), Books that deal with truths of faith (on cross of Christ or character of God), Books that help us live out our faith (Evangelism, Discipleship, suffering, work, relationships etc) and Books to deepen reflection (Biographies, fiction, poetry etc). Select at least one from each category in a year to read. Thirdly, **Work on the book** – get an overview, mark key paragraphs, summarize each chapter and record your findings. Finally, **Share with others** -what you've learnt or even the book.

Books have a power that nothing else has. Do not let another year go by forgetting their importance. Like all through in Church history, books will continue to play a vital role in the building up of God's people. Beware of reading for quantity to impress anyone. Let's read for our souls. It will help us to honour God by utilizing the minds He gave us and the Spirit He has sent to enable us to fulfil His command to love Him with all of our hearts, minds and strength. •

**JOHN SUKUMAR,** Assistant Professor and involves in Nizamabad EGF

జూన్ నెలలో 'సాహిత్యం' అనే శీర్షికలో వివిధ ఆర్టికల్స్ ప్రచురించడానికి సహాయపడిన బ్రదర్ నాని బాబు, లిటరేచర్ సెక్రటరీ మరియు డిపార్ట్‌మెంట్ సభ్యులకు వివి ఎడిటోరియల్ బోర్డ్ కృతజ్ఞతలు తెలుపుచున్నది.




# తెలుగు క్రైస్తవ సాహిత్య చరిత్ర మరియు ఆవశ్యకత

- ఎర్రన్న బొగ్గుల

ప్రపంచంలో భాషాపరంగా విభిన్న దేశాలలో భారతదేశం ఒకటి. సుదీర్ఘ చరిత్ర, అభివృద్ధి చెందిన లిపి ఉన్న 18 అధికారిక ప్రాంతీయ భాషలలో మన తెలుగు ఒకటి. సాహిత్య అకాడమీ వంటి సంస్థల ద్వారా భారతదేశంలోని ప్రతి ప్రాంతీయ భాష మరియు సాహిత్యాన్ని పరిరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది. నేడు దాదాపు 13 కోట్ల మంది తెలుగు మాట్లాడే వారు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు.

ప్రాంతీయ కథలు, నవలలు ద్వారా ప్రేరణ పొంది కొన్ని వందల సినిమాలు, నాటకాలు, టీవీ షోలు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికి వస్తున్నాయి. పెంగ్విన్, హార్పర్ కోలిన్స్, రాండమ్ హౌస్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ మరియు రూప వంటి పెద్ద ప్రచురణ సంస్థలు భారతీయ ప్రాంతీయ సాహిత్యం యొక్క అనేక రుచులను అందించడానికి ప్రత్యేక టీంలు తయారు చేసాయంటే అర్థం చేసుకోవచ్చు ప్రాంతీయ సాహిత్యానికున్న ఆదరణ.

పూర్వం భక్తి సాహిత్యం రాసే రచయితలు కవిత్వం, కథలు, వ్యాసాలు మరియు సంభాషణలను లాటిన్ మరియు స్థానిక భాషలలో రాశారు. వీరి రచనలు దేశ సామాజిక, రాజకీయ అంశాలపై ప్రభావం చూపాయి. ఈ రచనలు పాఠకుడు ఆలోచించడానికి, ప్రపంచ దృష్టిని తెలుసుకోవడానికి, పవిత్రమైన జీవితాన్ని గడపడానికి సహాయపడతాయి.

తెలుగు సాహిత్యంలో ఆకర్షణీయమైన కథలు, కవితలు, నవలలు, కవితలు, బుర్ర కథలు, జానపద కథలు లాంటి వివిధ సాహితి ప్రక్రియలు ఎన్నో ఉన్నాయి. విదేశీయులను ప్రభావితం చేయగల భారీ శక్తి సామర్థ్యం ఉంది. అంతేకాదు ప్రాంత ప్రజలను సులభంగా చైతన్యం చేయడానికి, త్వరగా ప్రజల్లో విస్తరించే అవకాశాలు మెండు.

## భారతీయ క్రైస్తవ సాహిత్యం పూర్వయుగం

క్రీస్తు శిష్యుడైన తోమా క్రీ.శ 53లో పర్షియా నుంచి కేరళకు వచ్చి యేసు బోధనలు ప్రచారం చేశాడు. ఆ తర్వాత సొసైటీ ఆఫ్ జీసస్ సంస్థకు చెందిన ఫ్రాన్సిస్ జేవియర్ 1542లో గోవాకు రావడంతో క్రైస్తవ్యంలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. సెయింట్ పాల్స్ కళాశాలను ప్రారంభించాడు. విద్యారంగంలో ఇది తొలి అడుగు.అనంతరం భారతదేశానికి వచ్చిన మిషనరీల్లో రాబర్ట్ డి నోబిలిని ప్రముఖంగా పేర్కొనాలి. 1606 మధురకు వచ్చి తెలుగు, తమిళం, సంస్కృత భాషలు నేర్చుకున్నాడు. క్రైస్తవ సిద్ధాంతాల మీద 100 సంస్కృత శ్లోకాలు రాసారు. మనవాళ్ళు ఆయనను 'తత్వబోధ స్వామి' అని పిలిచేవాళ్ళు. ఆయన తెలుగులో జ్ఞాన సంక్షేమం, పునర్జన్మ ఆక్షేపం, మోక్షసల్లాపము అనే గ్రంధాలు రాశారు. తర్వాత కాలంలో లూథరన్ ప్రొటెస్టెంట్ చెందిన రెవరెండ్ బెంజమెన్ షూల్జ్ 1700 సం॥లో మద్రాసు వచ్చాడు. ఇక్కడ తమిళం నేర్చుకుని బైబిల్‌ను తమిళంలోకి ముద్రించాడు. తెలుగు కూడా బాగా అధ్యయనం చేసి 1728 "గ్రామటిక తెలుగీక" అనే తెలుగు వ్యాకరణం ముద్రించాడు.

ఇంగ్లాండ్‌కు చెందిన విలియం కేరీ లండన్ మిషనరీ సొసైటీ పక్షాన కలకత్తాకు 1793లో వచ్చాడు. అక్కడ ఆయన బెంగాలీ భాష నేర్చుకుని బైబిలు అనువాదం చేశాడు ఆయనకు తోడుగా జాషువా మార్ష్ మన్, విలియం వార్డ్ తోడుగా వచ్చారు. మార్ష్ మాన్ బహుభాషావేత్త, పుస్తక ప్రచురణలో అనుభవం ఉంది. విలియం వార్డ్ ముద్రణలో తర్ఫీదు పొందాడు. వీరు ముగ్గురు కలిసి 1801-1832 వరకు బైబిళ్లు, వ్యాకరణాలు, నిఘంటువులు, రామాయణం మహాభారతం మొదలగునవి 47 భాషల్లో వేల గ్రంథాలను అచ్చువేశారు. బైబిలుకు సంబంధించినవి 33 భాషల్లో ముద్రించి భారతదేశమంతటికి పంపిణీ చేశారు. అంతేకాదు, 1814లో తెలుగు వ్యాకరణం, 1818లో క్రొత్త నిబంధనలోని నాలుగు సువార్తలు ముద్రించారు. భారతీయులకు బైబిల్ అందించాలనే ఉద్దేశ్యంతో బైబిల్ సొసైటీ 1865లో మద్రాసులో ఆవిర్భవించింది.

## తెలుగు సాహిత్య చరిత్ర

16వ శతాబ్దంలో తమిళం, బెంగాలీ, మరాఠీ రాష్ట్రాలకు చెందిన కొంతమంది క్రైస్తవ కవులు వెలుగులో ఉన్నట్టు చూస్తాం కానీ తెలుగులో చాలా చాలా తక్కువ. విజయనగర పరిపాలన కాలంలో గోవా పట్టణ కేంద్రంగా పనిచేసే రోమన్ కాథలిక్ మిషన్ సంస్థలు గోల్కొండ చంద్రగిరి ప్రాంతాలకు మిషినరీలను పంపాయి. ఆ సమయంలోనే కాటికిజం (మత సంబంధిత ప్రశ్నోత్తర గ్రంథం), సమ్మరీ ఆఫ్ గాస్పల్స్ (సువార్తల సారాంశం) లాంటి పుస్తకాలు సంస్కృతం, తెలుగు భాషల్లో అనువదించారు. వీటినే అతి పురాతనమైన తెలుగు క్రైస్తవ రచనలుగా పరిగణిస్తారు.

17వ శతాబ్దంలో మధురైలోని ఓ మిషన్ సంస్థ కూడా తెలుగు భాషలో కొన్ని ప్రతులు ప్రచురించిందని అంటారు. 'తౌభ్య చరిత్ర' (పింగళి ఎల్లనార్య), 'వేదంత రసాయనం' (మంగళగిరి ఆనంద కవి), 'జ్ఞాన చింతామణి' (మల్లెల తిమ్మరాజు) అనునవి ప్రముఖమైన పురాతనమైన రచనలుగా పేర్కొంటారు.

19వ శతాబ్దంలో ప్రొటెస్టెంట్ క్రిష్టియన్స్ విలియం దేవసన్ (లండన్ మిషనరీ సొసైటీ), పులిపాక జగన్నాధం లాంటి వారి రాకతో తెలుగు సాహిత్యం జీవం పోసుకుంది.తమిళనాడులోని తారంగంబడి పట్టణంలోని డానిష్ మిషన్ వారు తెలుగు, తమిళంలో అచ్చు వేయడం ప్రారంభించినట్టు స్కాలర్స్ చెబుతారు. 1742లో ముద్రితమైన "మోక్షమును కొంచిపోయే తోవ" అనేది తొలి తెలుగు పుస్తకంగా భావిస్తారు.

18-19వ శతాబ్దకాలంలో వివాదాస్పద సాహిత్యం మరియు సువార్త రచనలు మిషనరీలు చేశారు. ప్రముఖ క్రైస్తవేతర ఆధిపత్య రచనల వల్ల అవి అంతగా ప్రాధాన్యత సంతరించుకోలేదు. అంతేకాదు, అప్పట్లో దేశ అక్షరాస్యత 3% కంటే తక్కువ! తర్వాతి కాలంలో మిషనరీలు ప్రాంతీయ కవుల సహాయంతో తెలుగు నేర్చుకొని వారు అనువాదాలు, రచనలు చేస్తూ తెలుగు నిఘంటువులు, వ్యాకరణ అభివృద్ధికి కృషి చేసారు. లలిత, అరుద్ర, మంగమ్మ, బంగోరె, దోనప్ప లాంటి స్కాలర్స్ వారికి సహాయం చేసినట్లు చెబుతారు. ప్రారంభ దినాల్లో మిషనరీలు రాసిన తెలుగు అంత ఖచ్చితంగా లేకపోయినా కాలక్రమేణా ఎన్నో మార్పులు వచ్చాయి. బళ్లారిలోని కొంతమంది మిషనరీలు కూడా తెలుగు కరపత్రికలు పంచి పెట్టిన ఆనవాళ్ళు ఉన్నాయి.

ఉమ్మడి తెలుగు తమిళ రాష్ట్రంగా ఉన్న రోజుల్లో (1950) వి. చెక్కరాయ్, పి. చెంచెయ్య , ఏ. ఎస్ అప్పస్వామి లాంటి వారు భారతీయుల తాత్త్విక చింతనకు అనుగుణంగా క్రైస్తవ విశ్వాసాన్ని అన్వయింప చేసేందుకు నడుంబిగించారు. డా. పి. డి దేవనందన్, ఎం. ఎం.థామస్ లాంటి వారిచే క్రిష్టియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్టడీ ఫర్ రిలీజియన్ అండ్ సొసైటీ (సిఐయస్ఆర్యస్) 1957లో మద్రాసు కేంద్రంగా స్థాపించబడి వివిధ పత్రికలు, వ్యాసాల ద్వారా క్రైస్తవ వేదాంత వ్యాప్తికి శ్రీకారం చుట్టింది.

భారతీయుల సామాజిక నేపథ్యం, సంస్కృతిని దృష్టిలో పెట్టుకొని మతం సమాజానికి ఉన్న సంబంధాన్ని వివరిస్తూ సామాజిక, ఆధ్యాత్మిక ఆలోచనలు వెదజల్లింది. క్రిష్టాలజీ ఇన్ రిలేషన్ టు రాధా కృష్ణ ఫిలాసఫీ (సుజిత్ సింగ్), ఫోర్‌ఫోల్డ్ ఐడియా (పాల్ శేఖరన్), క్రిష్టోపనిషద్ (డా.ఫక్కీర్ భాయ్), సుందర్ సింగ్ బయోగ్రఫీ (ఏ. జే అప్పస్వామి), ఫిలసాఫీ ఆఫ్ లవ్ (నిర్గుణ బ్రహ్మ) లాంటి ఎన్నో రచనలు వెలువడ్డాయి. కొన్ని తెలుగులో అనువాదం చేయబడ్డాయి.

## ప్రముఖ తెలుగు క్రైస్తవ సాహితీవేత్తలు

### సి. పి. బ్రౌన్ (1798-1884)

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ

చేశారు. తెలుగు సంబంధించిన పదాల నిఘంటువును, వసుచరిత్ర, మనుచరిత్ర ప్రబంధాలను, వేలాదిగా ఉన్న వేమన పద్యాలను సేకరించి స్థానిక పండితుల సహకారంతో కడపలోని తన ఇంటిని పాండిత్య పీఠంగా నెలకొల్పారు. అనువాదంలో క్రైస్తవ మతానికి చెందిన బాప్టిజం, ద్రాక్ష రసం,ఆమెన్, కలుగునుగాక, హల్లెలూయా, సాతాను, పరిశుద్ధాత్మ, స్తుతి, స్తోత్రము, సువార్త, సున్నతి, సబ్బాతు మొదలైన పదాలను చేర్చాడు.

### మాసిలామణి (1914-1990)

"అందాల తార అరుదెంచె నాకై అంబర వీధిలో" అనే మహోన్నత క్రిస్మస్ గీతాన్ని వ్రాసింది మాసిలామణి గారే. ఆయన 'బిల్లీగ్రహం ఆఫ్ ద ఈస్ట్' గా పేరొందారు. వీరి తల్లి ఉపాధ్యాయురాలు. చిన్న చిన్న పాటలు రాసి పిల్లలకు నేర్పించేది. మాసిలామణి గారి భక్తి జీవితంపై, రచనల మీద తల్లి, తాతగార్ల ప్రభావం చాలా ఉండేది. "రండి సువార్త సునాదముతో - రంజిలు సిలువ నినాదముతో - తంబుర సితార నాదముతో - ప్రభుయేసు దయానిధి సన్నిధికి" అనే ప్రసిద్ధ గీతాల్ని వ్రాశారు. ఈ పాటలో ఆయన వేదాంత విలువలు కలిగిన పదాల్ని ఎన్నుకున్నారు. యేసు విశిష్టత, ఆయన గుణ లక్షణాలు వర్ణించడమే కాక జీవితానికి సర్వస్వం యేసే అని స్పష్టం చేశాడు. తెలుగు క్రైస్తవులందరినోటా ధ్వనించే అతిప్రీతికరమైన మరో గీతం "నడిపించు నా నావ". దోనెను లోపలకు నడిపి చేపలు పట్టడానికి మీ వలలు వేయుడి" అని యేసు ప్రభువు సీమోనుకు చెప్పినట్టి సన్నివేశం ఆధారంగా ఈ కీర్తనను రాశాడు. ఈ కీర్తనలోని ఆయన ఊహ అద్భుతం. తన ప్రయత్నం ఫలించక పోవడానికి గల కారణాల్ని ఈ విధంగా వర్ణించి, చివరకు పాటింతు నీ మాట అని కృత నిశ్చయానికి వస్తాడు.

> "అనుభవపూర్వకంగా రాసిన కీర్తనలన్నీ ఆధ్యాత్మిక భావాలతో నిండి ఆత్మీయ భావాన్ని కల్గిస్తాయి.

మాసిలామణి గారు మంచి రచయిత కూడా. ఈయన "రవి" అనే క్రైస్తవ మాసపత్రికకు సంపాదకుడిగా పనిచేశారు. "గృహ జ్యోతి" అనే మాసపత్రికను స్థాపించారు. తరువాత "కాపరి" అనే పత్రికను స్వంతంగా నడిపి క్రైస్తవ పత్రికా ప్రపంచంలో సంచలనం తేవడానికి ప్రయత్నించారు. ఈయన రాసిన "ప్రతిఫలం" అనే నవల ఆంధ్ర క్రైస్తవ సభ వారి గుర్తింపు పొందింది. బైబిలు గ్రంథానికి చక్కగా వ్యాఖ్యానం చెప్పి అశేష ప్రజానీకాన్ని క్రీస్తుమార్గంలో నడిపించారు. మాసిలామణి గారి చాలా కీర్తనలు సిలువే కేంద్రంగా, సందేశాత్మకంగా ఉంటాయి.

అనుభవపూర్వకంగా రాసిన ఈ కీర్తనలన్నీ ఆధ్యాత్మిక భావాలతో నిండి ఆత్మీయ భావాన్ని కల్గిస్తాయి. ఇలాంటి సద్భక్తులను మనకు అనుగ్రహించిన దేవుని మనం స్తుతింప బద్ధులమైయున్నాము. క్రైస్తవ సాహిత్యానికి వీరు చేసిన కృషి మరువలేనిది.

### పురుషోత్తం చౌదరి(1803-1890)

ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌధరి పురుషోత్తం గారు చేసిన సాహిత్య సేవ అమోఘం. దాదాపు 50 రకాల వివిధ సాహిత్య (కావ్య,శతక, ప్రబంధ మరియు వేదాంత, అపాలజీటిక్స్, క్రైస్తవ విలువకు సంబంధించి కరపత్రికలు) రచనలు చేశారు. అంతేకాదు రెవ. డా.హాయి తో కలసి తెలుగులో బైబిల్ కాంకోర్డెన్స్ రాశారు. దాదాపు 200 ఆణిముత్యాల్లాంటి భక్తి కీర్తనలను వ్రాసి, వాటికి సుప్రసిద్ధ కర్ణాటక సాహిత్యంలో రాగం, తాళం సమకూర్చారు. ఈ గీతాలు కేవలం భక్తిపూరితమైనవే కాదు గాని, సాహితీ సంపదతో తొణికిసలాడుతుంటాయి.

మనం ఇప్పటికీ పాడుకొనే "మంగళమే యేసునకు - మనుజావతారునకు", "త్రాహిమాం క్రీస్తునాథ -దయ జూడ రావే", "యెహోవ నా మొర లాలించెను" లాంటి ప్రసిద్ధికెక్కిన పాటలు వ్రాసి, గానం చేసినది ఆయనే. కీర్తనలు మాత్రమే గాక "క్రైస్తవ నీతి ప్రకాశం", "సత్య వేద సార సంగ్రహం", "కులాచార పరీక్ష" లాంటి ఎన్నో గ్రంథాలను కూడా రచించారు. ఆయన వ్రాసిన పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబిక్కినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తనలుగా నిలిచిపోయాయి. పాశ్చాత్య రూపంలోని ఓ కొత్త విశ్వాసాన్ని సృజనాత్మకంగా, అసలైన తెలుగు భాషలో పంచిపెట్టారు.

### మల్లెల దావీదు (1890-1961)

ఈయన పాటల్లోని ప్రత్యేకత ఏమిటంటే బైబిల్లోని వాక్యభాగాల్ని యథాతథంగా తీసికొని వాటికి స్వల్ప మార్పులతో సంగీతాన్ని సమకూర్చడం. ఉదా:కీర్తనలు 51వ అధ్యాయం ఆధారంగా వ్రాసిన పాట, "దహనబలి నీకు నయిష్టము - మరియు - దైవ బలులు విరిగిన ఆత్మయే - యెహోవదేవ విరిగిన - హృదయంబలక్ష్యము సేయవు". అలాగే 139, 121వ దావీదు కీర్తనలకు, లూకా సువార్త మొదటి అధ్యాయంలో జకర్యా పాడిన స్తుతి గీతానికి, ప్రభువు నేర్పిన పరలోక ప్రార్థనకు, విశ్వాస ప్రమాణానికి రాగ తాళాలను కూర్చి సంగీతీకరించారు.

కీర్తనలతో పాటు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనల్ని గావించారు. జూబిలీ నవరత్నమాల, జగజ్జయము, అస్పృశ్యత, అమ్మా కొక్కొరొకో అనే నాలుగు ఖండకావ్యాలను, ఆంధ్రమాత, దురాత్మ అనే రెండు శతకాలను, కవితలు, బాల ప్రార్థనా పద్యాలు, సమూయేలు చరిత్ర, యోనా కథావళి అనే కథలను, అర్థ భాను నాటకాన్ని, కావ్య చంద్రిక అనే లక్షణ గ్రంథాన్ని, జగద్రక్షణ అనే సత్కథా కాలక్షేపాన్ని, పంచతంత్రమనే నవలను,

“ నేటి తరాన్ని దృష్టిలో పెట్టుకొని, పాటలు, పద్యాలు, గజల్స్, కవితలు, హైకూలు, చిన్ని కథలు... వ్రాయవలసిన ఆవశ్యకత ఉంది.



సాక్షి–భగవద్భక్తి అనే వేదాంత గ్రంథాలతో పాటు బాలవేదాంత కథలు, లాజరు కథలు, దేశభక్తి గీతాలు, అసంఖ్యాకమైన ఆధ్యాత్మిక భక్తి గీతాల్ని వ్రాసి అటు తెలుగు భాషా సాహిత్యాలకు, ఇటు తెలుగు క్రైస్తవ సంఘానికి అమూల్యమైన సేవ చేసిన మహా రచయిత.

1937లో మల్లెల దావీదు, రెవ.ఎమ్.ఎల్.డోల్బీర్ మరియు రెవ. బి. హెబ్బి దేవిస్ గార్లు ముగ్గురు సంపాదక త్రయంగా ఏర్పడి చేసిన కృషిఫలితమే మనమీనాడు ఆరాధనల్లో ఉపయోగిస్తున్న ఆంధ్రక్రైస్తవ కీర్తనల గ్రంథం. మల్లెల దావీదుగారు తన సుదీర్ఘ జీవితయాత్రలో ఊరూరా సువార్త పరిచర్య గావిస్తూ తాను పొందిన రక్షణానందాన్ని అనేకులకు తెలియజెప్పాలనే దృఢ సంకల్పంతోహా “సాక్ష్యమిచ్చెద మన స్వామి యేసు దేవుడంచు” అని ఎలుగెత్తి చాటారు. స్వీయ సాక్ష్యాన్ని సాక్షాత్కరించిన ఈ పాట ప్రతి క్రైస్తవ విశ్వాసికి మార్గదర్శకం.

### గుర్రం జాషువా (1895–1971)

తెలుగు క్రైస్తవ సాహిత్యంలో 1960 వరకు కావ్య రచన అంతగా లేదు గుర్రం జాషువా అనంతరం తెలుగులో క్రైస్తవ కావ్యాలు ఎక్కువయ్యాయి. వీరు రచించిన క్రీస్తు చరిత్ర కు కేంద్ర సాహిత్య బహుమతి కూడా వచ్చింది. జాషువా తన కవిత్వంలో రోజువారి వ్యవహారిక పదాలను కూర్చి అందంగా అలంకరించి కవితా సంపుటి, ఘటన సన్నివేశాలకు మనోహరమైన కవితా కృతిని కల్పించి, మూలభావం చెడకుండా చేశాడు. యేసు జననానికి ప్రపంచంలోని జడ పదార్థాలన్నీ ఎదురుచూసాయని, ఆయన పాదాలను తాకడానికి భూదేవి స్వాగతం పలికిందనే శ్రేష్ఠమైన భావన రచనల్లో గుప్పించే నేటితరం గుర్రం జాషువల అవశ్యకత తెలుగు సాహిత్యానికి ఎంతైనా ఉంది.

### బేతాళ జాన్ కవి (1840–1895)

ఆంధ్ర క్రైస్తవ కీర్తనల గ్రంథంలో తొలి కీర్తన, “అన్ని కాలంబుల–నున్న యెహోవా నిన్నెదరంబ–యో కన్నతండ్రి” అనే పాటలో దేవుని గుణగణాలని ప్రస్తావిస్తూ, అలాంటి గొప్ప దేవుడవైన నిన్ను స్తుతించడానికి నేనేపాటివాడిని? అని తన్ను తాను ప్రశ్నించుకొంటాడు రచయిత బేతాల జాన్ కవి. జాగ్రత్తగా ఆ పాటను విన్నపుడు మనం అదే పని చేస్తాం.

ఒక సారి బేతాళ జాన్ కవి గారు భార్యను పల్లకిలో గుంటూరు ఆస్పత్రికి పంపుతుండగా, బోయల అజాగ్రత్త వల్ల మార్గంలో పల్లకి క్రింద పడిందంట. నిండు చూలాలైన ఆమె తలకు దెబ్బ తగిలి, మతిభ్రమణం కలిగిందట. మతి భ్రమణ వ్యాధితో బాధపడుతున్న భార్యను చూసి నిరాశ నిస్పృహలకు లోనుగాక, దైవ గ్రంథంలోని భక్తుల జీవితాల్ని చదివి, ధైర్యం పొంది, ఆయా భక్తులు తమ జీవితంలో ఎదురైన కష్టాల్ని ఎలా సహించారో ఒక్కొక్క చరణంలో తెలుపుతూ, “జడియకుము నేనే యున్నానని–కడు నెనరున వాక్కిచ్చిన యేసుని అడుగుజాడలు అనుగమించి–నడుచుకొనరాదా–జీవ ఇడుములధికము గల్గిన ప్రభుని–కడకు జేరరాదా” (ఇడుములు = కష్టాలు) అని, తన స్వీయ జీవితంలో ఒకానొక కష్ట సమయాన వ్రాసిన పాట ప్రతి విశ్వాసికి మార్గదర్శకం.

ఆపద కలిగినపుడు దేవుని దూషించకూడదని ఈ పాటలో ఆయన చెప్పిన విధం తన దృఢ విశ్వాసానికి ప్రతీక. ఒకవైపున భార్య అనారోగ్యం, మరో వైపు రక్తసంబంధికులు, బంధువుల నుండి నిందలు, ఇలా ఎంతో కష్టపరిస్థితుల్లో సహితం ఆయన దేవుని ప్రేమను చూడగలిగాడే తప్ప, కోపానికి తావు ఇవ్వలేదు. కరోనా విపత్కర దినాల్లో అలాంటి పాటలు విన్నప్పుడు దేవుని ప్రేమను కష్టకాలంలో తరచి చూడడానికి మనకు దోహదపడతాయి.

దేవదాస్ అయ్యగారు, అత్తోట రత్నాకవి, పసుపులేటి అంద్రెయా, సురగాలి తిమోతి జ్ఞానానంద, చిన్నబత్తిని మైకల్ రవి, రెవ.ఫాదర్ ఐజయ్య, ప్రొఫెసర్.బి.ఎల్ బెన్నీ ఇలా ఎందరో ప్రముఖ కవులు వారి తెలుగు రచనల ద్వారా క్రైస్త్వవ్యాన్ని ప్రచుర పరిచారు. మహిళల్లో తాడినాగమ్మ, పంతగడ శేషమ్మ, కొమ్ము దయమంతి దేవి, నంబూరి పరిపూర్ణ, మామిడి సత్యవతి లాంటివారు ఉన్నారు.

అధునికంగా వచన కవిత్వాలు రాసేవారు చాలామంది ఉన్నారు. పెద్దింటి యెహాన్, బండారు జ్యోతి స్వరూప రాణి, స్వర్ణలత దేవి, గుజ్జర్లమూడి శ్రీహర్ష, ఝాన్సీ, కె వి కుమారి ఎండ్లూరి సుధాకర్, దార్ల వెంకటేశ్వరరావు, శిఖామణి, తాళ్లూరి లాబన్ బాబు, పాడేటి జాన్సన్, కోయి కోటేశ్వరరావు, కొండే పోగు డేవిడ్ లివింగ్ స్టన్, తాళ్లూరి ప్రసాద్ మొదలగు వారు లెక్కకు మించి ఉన్నారు.

సాహిత్యంలో రచయితల భావోద్వేగం (ప్రేమ, ద్వేషం, కృతజ్ఞత, కోపం, ధైర్యం, భయం, ఆశ, నిరాశ...) మొత్తం ప్రదర్శించబడుతుంది. సాహిత్యం మనకు భావోద్వేగాన్ని ఇవ్వడమే కాదు బోధిస్తుంది. ఇది ప్రణాళికాబద్ధమైన ఓ రచన, తప్పించుకోలేని వాస్తవికత. అవి పాఠకుడి స్థితిని, ప్రపంచ పోకడలు మరియు దైవత్వం, మానవత్వం యొక్క స్వభావం గురించి తెలుసుకోవడానికి సాయం చేస్తాయి.

> “ క్రైస్తవ పాఠకుడు సాహిత్యాన్ని దేవుని స్వరూపంలో సృష్టించిన మానవ రచయిత నుండి అర్థవంతమైన వ్యక్తీకరణ అని గ్రహించాలి.

## నేటి తెలుగు సాహిత్య సవాళ్ళు

1. 21వ శతాబ్దంలో సాహితీ ప్రక్రియకు సంబంధించి పెనుమార్పులు సంభవించాయి. పాఠకుడి, రచయిత ఆలోచనా విధానమే దానికి ప్రధాన కారణం. అలాగే సాంకేతిక పరిజ్ఞానం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ విజ్ఞాన మాధ్యమాలు కూడా కారణమే. 23 దావీదు కీర్తనను శంకరాభరణం రాగంలో పురుషోత్తమ చౌదరి రాసిన “యెహోవా నా కాపరి” అనే పాట ఈతరం వారికి అర్థమవ్వడానికి కొంచెం కష్టంగా ఉంటుంది. కాబట్టి నేటి తరాన్ని దృష్టిలో పెట్టుకొని, పాటలు, పద్యాలు, గజల్స్, కవితలు, హైకూలు, చిన్ని కథలు... రాయాల్సిన ఆవశ్యకత ఉంది.
2. విలియం కేరీ భారతదేశ ప్రాంతీయ భాషల సాహిత్యం యొక్క అభివృద్ధిని మరియు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నేటి క్రైస్తవ సంఘాలు, క్రైస్తవ నాయకులు ఆ విషయాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి.
3. ప్రస్తుత కాలంలో డిజిటలైజేషన్, ఆన్‌లైన్‌లో రచనలు చదివేవారు పెరిగారు. తెలుగు క్రైస్తవ సాహిత్యం కూడా నెట్టింట్లో ప్రత్యేకమైన అలమరలు ఏర్పరుచుకోవాలి. కిండెల్, అమెజాన్‌లో మరిన్ని తెలుగు సాహిత్య గ్రంథాలు, ఆన్‌లైన్‌లో తెలుగు లైబ్రరీలు రావాలి.
4. ఆంగ్లంలో అనేక క్రైస్తవ పుస్తకాలు ఉన్న కొంతమంది తెలుగు క్రైస్తవ నాయకులు, విద్యార్థులు సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఆంగ్లం రాని తెలుగు పాస్టర్లూ ఎక్కువే. వారు క్రైస్తవ వేదాంతం, ప్రముఖ క్రైస్తవ సిద్ధాంతాలకు సంబంధించి మంచి రచనలు తెలుగులో అందుబాటులో లేక, సంఘాన్ని కాయడంలో ఇబ్బందులు పడుతున్నారు. తెలుగులో మరిన్ని అనువాద రచనలు రావాల్సివుంది. ప్రచురణకర్తలు వీటిపై దృష్టి పెట్టాలి.
5. పోటీ ప్రపంచంలో క్రైస్తవ విలువలతో కూడిన సినిమాలకు, షార్ట్ ఫిల్మ్స్, వెబ్సిరీస్‌లకు కథలు (ఉదా:వ్యభిచరించవద్దు, నిన్ను వలే నీ పొరుగువానిని ప్రేమించు) రాసే కంటెంట్ రైటర్స్ కావాలి.
6. సాహిత్యం అనేది తనను తాను వెల్లడించడానికి దేవుడు ఎంచుకున్న ప్రధాన మాధ్యమం. సాహిత్యం ద్వారా మానవాళికి తనను తాను వెల్లడించాడు. మానవాళికి ఇవ్వబడిన బైబిల్‌లో సాహితీ విధానాలు ఉన్నాయి. అది సరిగా తెలుగు క్రైస్తవులు చదవకుండా చేసేందుకు అపవాది, పాపానికి లోనైన శరీరం ఆటంకాలుగా ఉండకుండా ప్రార్థన చేయాలి. అంతేకాదు, పరిశుద్ధాత్మ పై ఆధారపడి రచనలు చేసేవారు మరీ ఎక్కువగా రావాలని ప్రభువుని వేడుకోవాలి.

క్రైస్తవ పుస్తకం, కరపత్రిక లేదా ఒక మిషనరీ గాథ, ఎప్పుడూ మౌనంగా ఉండదు, ఎప్పుడూ అలసిపోదు. అది వివిధ రూపాలలో జీవం పోసుకుంటుంది. తద్వారా కొన్ని జీవితాలు ప్రభువులోకి నడిపించబడతాయి. తెలుగు సాహిత్యం అనారోగ్యంతో ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత తెలుగు క్రైస్తవులదే.

తెలుగు క్రైస్తవ సాహిత్య, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని భవిష్యత్ తరాలకు తెలియజెప్పడం మన బాధ్యత. అలా తెలియ జెప్పాలనే సంకల్పంతోనే భక్తుల జీవిత గాథలను, కావ్యాలను పిల్లలకు నేర్పించడం చేయాలి.

బైబిల్ మరియు బైబిల్ ఆధారిత సాహిత్య రచనలు సత్యాన్ని తెలియచేస్తాయి. జ్ఞానం, విశ్వాసం మరియు విధేయతను వృద్ధి చేస్తాయి. కాబట్టి సాహిత్యం ముఖ్యం కాదని ఏ క్రైస్తవుడూ చెప్పలేడు. క్రైస్తవ పాఠకుడు సాహిత్యాన్ని దేవుని స్వరూపంలో సృష్టించిన మానవ రచయిత నుండి అర్థవంతమైన వ్యక్తీకరణ అని గ్రహించాలి. అన్ని విషయాలు, తినడం, పానీయం సేవించడం లేక సాహిత్యం అనువర్తిచడం, చదవడం, రచన అనేవి దేవుని మహిమ కొరకు చేయాల్సినవని మరువరాదు.

క్రైస్తవ పాఠకులు సాహిత్యాన్ని తక్కువ చేసి చూడకూడదు. అలా అని చెప్పి విసుగు తెప్పించేవి, అర్థంలేనివి, వ్యక్తిగతంగా మనకు ప్రాధాన్యత లేనివి, బైబిల్‌కు విరుద్ధమైన ఆలోచనలు, మిడి మిడి జ్ఞానంతో రాసే వారి రచనలకు దూరంగా ఉండాలి. సాహిత్యమును ఆస్వాదిస్తూ, చదివినప్పుడు స్వపరిశీలన చేసుకుంటూ, అందులోని ప్రయోజనకరమైన కొన్ని సూత్రాలను మనకు అన్వయింపు చేసుకోవాలి. ముఖ్యమైన వాటిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

దేవుడు అట్టి కృపను మనకు ప్రసాదించును గాక! ●


**Bibliography**

1.Indian literature magazine Jan 2015 published by sahityam academy

2.తెలుగులో క్రైస్తవ సాహిత్యం –ఆచార్య గుజ్జర్లమూడి కృపచారి

3.ఇంటర్నెట్



ఎర్రన్న బొగ్గుల, రీసెర్చ్ స్కాలర్ మరియు హెచ్‌సియు ఇజియఫ్‌కు హాజరగుచున్నారు



**– బి.రామకృష్ణ**

**నా** పేరు రామకృష్ణ. మా ఊరు చిత్తలూరు గ్రామం, చేజర్ల మండలం, నెల్లూరు జిల్లా. మా తల్లిదండ్రులకు నేనొక్కడినే కుమారుడిని. ఇద్దరు కుమార్తెలు. నేను హిందూ కుటుంబంలో పుట్టాను. నేను, నా తల్లిదండ్రులతో పాటు విగ్రహారాధన చేసేవాడిని. మా తల్లిదండ్రులు కష్టపడి పని చేసి మా ముగ్గురిని చదివించారు. నేను డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నప్పుడు మా ఇంటికి మా బంధువైన ఒక బామ్మ వచ్చింది. ఆమె క్రైస్తవురాలు. ఆమె నా కోసం ప్రార్థన చేసింది. తర్వాత నేను హాస్టల్‌కు వెళ్ళిపోయాను. తర్వాత కొన్ని సమస్యలు రావడంతో మనశ్శాంతి లోపించింది. హిందూ దేవుళ్లకు మ్రొక్కిన గాని సమాధానం రాలేదు. మా హాస్టల్‌లో ఇయు విద్యార్థులు ఉండేవారు. వాళ్ల దగ్గరికి వెళ్లి "యేసు ప్రభువును నమ్ముకోవాలని అనుకుంటున్నాను'' అని చెప్పాను. వాళ్లు నాకు యేసుప్రభు గురించి చెప్పి, ఇయు బైబిల్ స్టడీస్‌కు, చర్చిలకు తీసుకుని వెళ్లారు. యేసు ప్రభువు ప్రేమకు ఆకర్షితుడనై ఫిబ్రవరి 2006వ సం॥లో యేసు ప్రభువును నా స్వంత రక్షకునిగా అంగీకరించాను. మొదట్లో మా తల్లిదండ్రులు కొంత వ్యతిరేకించినప్పటికీ తరువాత నీ ఇష్టమని చెప్పారు. నేను బిబియస్, చర్చికి వెళుతూ ఆత్మీయంగా బలపడ్డాను. ఇయు సహవాసం నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఇయు క్యాంపులకు వెళ్లి యేసు ప్రభు గురించి మరింత ఎక్కువగా తెలుసుకున్నాను. నేను పుత్తూరులో ఎంసీఏ చదివాను. అక్కడ విద్యార్థుల మధ్య పని చేయడానికి, ఐసిఇయు కమిటీ మెంబర్‌గా పని చేయడానికి దేవుడు కృప చూపించాడు. ఎంసీఏ పూర్తయిన తర్వాత హైదరాబాద్‌కు వచ్చాను. సాఫ్ట్ వేర్ జాబ్ చేస్తూ సనత్ నగర్‌లో సింగిల్ గ్రాడ్యుయేట్‌గా ఉన్నాను. ఆ సమయంలో విద్యార్థుల మధ్య పని చేయడానికి, ఇజియఫ్ కమిటీ మెంబర్‌గా ఉండటానికి దేవుడు కృప చూపించాడు. ఆవిధంగా చేస్తున్నప్పుడు దేవుని తన సేవ పట్ల నా హృదయంలో భారం పెట్టాడు. యెహోషువ 1:5,6,9; హగ్గయి 2:23 ద్వారా, పరిస్థితుల ద్వారా దేవుడు మాట్లాడాడు. ఆ విషయాన్ని మా తల్లిదండ్రులతో, స్థానిక గ్రాడ్యుయేట్‌లతో పంచుకున్నప్పుడు వారు కూడా అంగీకరించారు. జూన్ 1, 2019 వ సం॥లో హైదరాబాద్‌లో గ్రాడ్యుయేట్ హెల్పర్‌గా జాయిన్ అయ్యాను. ఒక సంవత్సరం పది నెలలు గ్రాడ్యుయేట్ హెల్పర్‌గా ఉంటూ విద్యార్థుల మధ్య పని చేశాను. దేవుని చిత్తానుసారంగా, ఏప్రిల్ 1, 2021న యు.ఇ.యస్.ఐ–టి.యస్ స్టాఫ్ కోఆర్డినేటర్‌గా జాయిన్ కావడానికి దేవుడు కృప చూపించాడు.

సేవకు వచ్చే విషయంలో, మరికొన్ని విషయాలలో కొంత సమయం కనిపెట్టవలసి వచ్చింది. అయినప్పటికీ, దేవుడు ఆ సమయంలో తన వాక్యం, సహవాసం ద్వారా ఆదరించి బలపరిచాడు. నా అవసరాలను దేవునికి చెప్పినప్పుడు, ఆయన అద్భుతంగా ఎన్నో సార్లు సహాయం చేసినాడు. నా జీవితంలో దేవుడు చూపిన కృప, ఆయన చేసిన సహాయాన్ని బట్టి ఆయనకు కృతజ్ఞుడను.

**స్తుతి అంశాలు**

1. స్టాఫ్ కో–ఆర్డినేటర్‌గా జాయిన్ కావడానికి దేవుడు చేసిన సహాయాన్ని బట్టి
2. మా కుటుంబం విషయంలో దేవుని కాపుదల బట్టి
3. మా తల్లిదండ్రులను దేవుడు రక్షించిన దాన్ని బట్టి

**ప్రార్థనాంశాలు**

1. నా భవిష్యత్ మరియు పరిచర్య నమ్మకంగా చేయడానికి
2. మా తల్లిదండ్రుల ఆరోగ్యం కొరకు
3. మా సోదరి, బావ రక్షణ కొరకు
4. మా చిన్న చెల్లెలు వివాహం కొరకు

**బి.రామకృష్ణ,** స్టాఫ్ కో–ఆర్డినేటర్, వికారాబాద్



# యోకెబెదు

– యస్.పరన్ జ్యోతి సుదర్శన్

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో ఉన్నప్పుడు యోసేపును ఎరుగని ఫరో వారికి శ్రమ కలిగించడమే కాకుండా నిర్మూలం చేయడానికి ప్రయత్నించాడు. ఆ శ్రమ వారిని ఐక్య పరిచింది, పవిత్ర పరిచింది, ప్రత్యేకంగా జీవించడం నేర్పింది, విగ్రహారాధన నుండి వేరుపరిచింది. విధేయత, భక్తి నేర్చుకున్నారు. ఆ శ్రమల కొలిమి అయిన ఐగుప్తు, దేవుని ప్రజలకు ఓ తర్ఫీదు శాలగా మారింది.

ఆ సమయంలో లేవీయుడైన అమ్రాము, లేవి కుమార్తెయైన యోకెబెదును వివాహమాడాడు. వారికి సంతానంగా మిర్యాము, అహరోను, మోషే జన్మించారు. వారున్న పరిస్థితులలో మోషే దేవునికి నమ్మకమైన నాయకుడిగా ఎదగడానికి యోకెబెదు గొప్ప పాత్రను పోషించింది. యోకెబెదు అనగా 'యెహోవా యొక్క మహిమ' అని అర్థం.

## మోషే బ్రతుకుటకు ప్రణాళిక

ఐగుప్తీయులు, ఇశ్రాయేలీయులను శ్రమపెట్టిన కొలది వారు మరియెక్కువ విస్తరించడం రాజు చూసి, పుట్టబోవు మగపిల్లలను చంపమని ఆజ్ఞాపించాడు. యోకెబెదు మూడు నెలల మోషేను బయటపడకుండా దాచి పెట్టుటకు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్న పిదప అతనిని దాచలేక బ్రతికించుకోవడానికి ఒక మంచి ప్రణాళిక వేసింది. మోషే కొరకు ఒక జమ్ము పెట్టెను తీసుకొని దానికి జిగట మన్ను, కీలు పోసి నీరు లోపలికి వెళ్లకుండా తయారు చేసింది. దానిలో తన కుమారుని ఉంచి, ఎలాంటి అపాయం కలుగకుండా తగు జాగ్రత్తతో ఏటి ఒడ్డున నాచులో ఆ పెట్టెను ఉంచి, వానికి ఏమి సంభవించునో తెలుసుకోవడానికి వాని అక్కను దూరంగా నిలిపియుంచింది. ఫరో కుమార్తె జమ్ము పెట్టెను తెరిచి చూచినప్పుడు బాలుడు ఏడ్చుచుండగా చూచి కనికరపడి దగ్గరకు చేర్చుకుంది నిర్గమ (2:6). అదే సమయంలో మోషేను తన తల్లి దగ్గరకు చేర్చుటకు మిర్యాము ప్రణాళికాబద్ధమైన పాత్రను పోషించింది.

## మోషేను పెంచిన విధానం

యోకెబెదు దాదాపు 2-3 సం॥రాలు మోషేను పెంచి ఫరో కుమార్తె యొద్దకు తీసుకొని వచ్చినప్పుడు ఆమె మోషేను దత్తపుత్రునిగా చేసుకొంది.

అతడు పెద్దవాడైన తరువాత ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించి, మాటలయందును, కార్యములందును ప్రవీణుడై యుండెను" (అపో 7:22). "తన జనులయొద్దకు పోయి వారి భారములను చూచెను" (నిర్గమ 2:11). "ఐగుప్తు ధనముకంటె క్రీస్తువిషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని... ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టి యుంచెను" (హెబ్రీ 11:24-26). "భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు" (సంఖ్యా 12:3) "అతడు నా యిల్లంతటిలో నమ్మకమైనవాడు" (సంఖ్యా 12:7).

పైన మోషే విలువలను చూచినప్పుడు యోకెబెదు మోషేను దేవుని ప్రజల పక్షాన, దేవుని కొరకు నిలబెట్టడం కోసం ఆమె పెంచిన దాదాపు రెండు మూడు సంవత్సరాల కాలంలో తన ప్రజల గురించి మరియు దేవుని గురించిన విలువలను ఎంతగా నేర్పిందో మనకు అర్థమవుతుంది.

సాధారణంగా, 0-3 సం॥రాల పిల్లలలో 50% వ్యక్తిత్వం ఏర్పడుతుంది. దీనికి నిదర్శనం యోకెబెదు మోషేను పెంచిన విధానం.

## యోకెబెదు విశ్వాసం

యోకెబెదు దేవుని యందు విధేయత, భయభక్తులు మరియు విశ్వాసం కలిగిన స్త్రీ. ఆమె దేవుని ప్రణాళికను నెరవేర్చుటకు తనవంతు పాత్రను పోషించింది. ఆమె కుమారుని కనినప్పుడు సుందరుడై యుండుట చూచి మూడు నెలలు వానిని దాచెను. ఇది రాజాజ్ఞకు విరోధం. దీనిలో ఆమె విశ్వాసం కనబడుతుంది.

యోకెబెదు మోషేను దాచి పెట్టడం వలన కాదు కానీ ఆమె విశ్వాసం వలన దేవుని దృష్టిలో ప్రసిద్ధి చెందింది.

### 1. ఆమె విశ్వాసమునకు పరీక్ష

నిర్గమ 1,2 అధ్యాయాలలో వివరించిన పరిస్థితులు ఇశ్రాయేలు ప్రజలకు చీకటి రోజులను సూచిస్తున్నాయి. అలాంటి రోజుల్లో కుటుంబంలో కొత్త రాకను ఎదురు చూస్తున్నప్పుడు మగ శిశువును నైలు నదిలో పడవేయవలసి వస్తుందని ఆమెకు తెలుసు మరియు తల్లిదండ్రులు అవిధేయత చూపిస్తే వారు మరణం వరకు రాజుకు లోబడి ఉండాలి. ఇది ఖచ్చితంగా యోకెబెదుకు పరీక్ష సమయం. కానీ భయం, నిరాశ వ్యక్తపరిచే బదులు ఆమెకు విశ్వాసం ఉన్నట్లు కనిపిస్తుంది.

### 2. ఆమె విశ్వాసమునకు పునాది

ఇశ్రాయేలీయులు ఎప్పటికీ నశింపలేరని మోషే తల్లిదండ్రులకు తెలుసు. ఎందుకంటే తమ పితరుడైన అబ్రహాముకు దేవుడిచ్చిన వాగ్దానాన్ని గుర్తించారు (ఆది 12:3,13,15). వారు ఐగుప్తులో అనుభవిస్తున్న బానిసత్వం నుండి విడుదలను ఇస్తాడని, దేవుడు ముందుగా చెప్పాడని యోకెబెదుకు తెలుసు. ఈ ప్రణాళికలో భాగంగా దేవుడు మోషేను ఏర్పర్చుకున్నాడనే నమ్మకాన్ని, దేవుడు వారి హృదయంలో కలుగచేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదే ఆమె విశ్వాసమునకు పునాది.

### 3. ఆమె విశ్వాసాన్ని అభ్యాసించుట

యోకెబెదు దేవుని పట్ల తనదైన విశ్వాసం కలిగి ఉంది కాబట్టి ఆమె ఐగుప్తులో ఉన్న పరిస్థితులను గురించి బాధపడక, ఈ బిడ్డ ఇశ్రాయేలీయుల విమోచకుడైతే అతనిని దేవుడు ఎలాగైనా రక్షించగలడని ఆశించి తాను చేయవలసిన పని అంతటినీ చేసినట్లుగా గమనించగలం.

### 4. ఆమె విశ్వాసమునకు ప్రతిస్పందన

ఆమె విశ్వాసమునకు ప్రతిస్పందనగా దేవుడు ప్రణాళికలను నెరవేర్చుటకు, ఆమె విశ్వాసమును గౌరవించటానికి అద్భుతమైన సంఘటలను చేశాడు. మోషేను కాపాడడం మరియు విలువలు గల, నమ్మకమైన గొప్ప నాయకుడిగా మోషే దేవుని పక్షాన తన ప్రజల కొరకు నిలబడేటట్లు చేశాడు.

## ముగింపు

యోకెబెదు లాగా మనం కూడా దేవుని యందు భయభక్తులు కలిగి దేవుడు మనకిచ్చిన పిల్లలను దేవుని ఉద్దేశపూర్వకంగా పుట్టిన నాటి నుండి ఆయన విలువలను నేర్పుతూ ఆయన పని కొరకు సిద్ధపరచాలి.

యోకెబెదు మనలాంటి వ్యక్తే. ఈ పరీక్షల మధ్య ఆమెకు విశ్వాసం, ఆశ కలిగింది. ఇది దేవుని వాగ్దానాలపై ఆధారపడటానికి కారణమయ్యింది. కాబట్టి మనం కూడా పరీక్షలలో, శ్రమలలో దేవుని వాక్యంపై ఆధారపడి ఆయనను విశ్వసించి, ఆ విశ్వాసంలో నిలకడగా నిలబడి ప్రతిఫలం పొందుకోవాలి. దేవుడు అట్టి కృపను దయచేయును గాక! •

**యన్.పరన్ జ్యోతి సుదర్శన్,** నర్సింగ్ ట్యూటర్, గాంధీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ మరియు ఇయన్ఎఫ్ఐ-టియస్ కార్యదర్శిగా ఉంటున్నారు



"God shapes the world by prayer."
- E. M. Bounds

# జూన్ 2021 ప్రార్థనాంశాలు

**సెంట్రల్ తెలంగాణ**

రీజినల్ కో-ఆర్డినేటర్: సహో. బి. దేవరాజ్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్: హైదరాబాద్ - సహో. వై. సత్యవేలు
రంగారెడ్డి - సహో. సి. శ్రీకాంత్
స్టాఫ్:
హైదరాబాద్- సహో.కె.గాబ్రియేల్ & సహోదరి నీతూ మస్సీ
రంగారెడ్డి-సహో.ఎ.అప్పారావ్ & సహోదరి సుజానా వెస్టన్
హైదరాబాద్ -సహో.కె.రవికుమార్ & సహోదరి అరుణ కుమారి
స్టాఫ్ కో-ఆర్డినేటర్: వికారాబాద్ - బి.రామకృష్ణ

**అమీర్‌పేట:** జరుగుతున్న బైబిల్ స్టడీస్ మరియు పరిచర్యను బట్టి, కమిటీ మీటింగ్, ప్లానింగ్ కొరకు, బైబిల్ స్టడీస్, వారాంతపు ప్రార్థన, ఇజియఫ్‌లో స్పెషల్ టాక్స్‌ను బట్టి స్తుతించండి.

బైబిల్ స్టడీస్ అర్థవంతంగా జరుగునట్లు, వారాంతపు ప్రార్థనలో క్రమం తప్పకుండా పాల్గొనునట్లు, యంపిసిలు, ఇబియస్, బిబియస్‌లు కొరకు, విద్యార్థినీల బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగునట్లు ప్రార్థించండి.

**ఘట్‌కేసర్:** జరుగుతున్న బైబిల్ స్టడీస్, జీడిమెట్లలో లభించిన నూతన కాంటాక్ట్స్, ఆరంభమైన బిబియస్‌ను బట్టి స్తుతించండి.

5 ఇబియస్‌లు, 3 బిబియస్‌లు క్రమంగా జరుగునట్లు, ఔట్‌రీచ్‌గా ఉన్న ఎన్‌ఎఫ్‌సిలో ప్రేయర్ సెల్ క్రమంగా కొనసాగునట్లు, బ్రదర్ మణికుమార్ తల్లి మేరమ్మ గారి ఆరోగ్యం, పిల్లల కోసం ఎదురుచూస్తున్న బ్రదర్ స్వామి మరియు సిస్టర్ లలిత, బ్రదర్ ఎబినేజర్ మరియు సిస్టర్ కెరెన్ కుటుంబాల కొరకు ప్రార్థించండి.

**ఉస్మానియా యూనివర్శిటీ:** ఈ కోవిడ్ పరిస్థితులలో జోన్‌లోని కుటుంబాలు, విద్యార్థులను దేవుడు కాపాడుతూ వచ్చినందుకు స్తుతించండి.

నూతన విద్యార్థులు, క్యాంప్స్ కొరకు, విద్యార్థులు సాక్ష్య జీవితాన్ని కలిగియుండునట్లు, ఔట్ గోయింగ్ విద్యార్థుల భవిష్యత్తు, వారి తల్లిదండ్రుల రక్షణ కొరకు ప్రార్థించండి.

**కొంపల్లి:** అనారోగ్యం నుండి కోలుకున్న బేబి ప్రిన్స్‌ను బట్టి స్తుతించండి.

యాక్సిడెంట్‌కు గురై సీరియస్‌గా ఉన్న సిస్టర్ షీబా ఆరోగ్యం కొరకు, ఓ.ఎం. బుక్స్ మరియు గుడ్ షెపర్డ్ సంస్థ అకౌంట్స్ బ్లాక్ అవడం వల్ల సేవకులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దాన్ని బట్టి ప్రార్థించండి.

**బోయిన్‌పల్లి:** ఈ కోవిడ్ పరిస్థితులలో జోన్‌లోని కుటుంబాలు, విద్యార్థులకు దేవుని కాపుదలను బట్టి స్తుతించండి.

మలేరియాతో బాధపడుతున్న బ్రదర్ దినకర్ స్వస్థత, కోవిడ్‌తో బాధపడుతున్న బ్రదర్ ఎలీషా ఆరోగ్యం, సిస్టర్ శారా రమణయ్యకు ఉద్యోగం దొరుకునట్లు, నిష్వంత్ ముక్కుకు సర్జరీ కొరకు ప్రార్థించండి.

**సనత్‌నగర్:** కోవిడ్ నుండి బ్రదర్ జయబాబు కుటుంబం పూర్తిగా కోలుకున్నందుకు స్తుతించండి.

అందరిని దేవుడు ఈ కోవిడ్ పరిస్థితుల్లో

క్షేమంగా ఉంచునట్లు, సింగిల్ గ్రాడ్యుయేట్స్ భవిష్యత్తు, సంతానం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల కొరకు ప్రార్థించండి.

**కూకట్‌పల్లి:** ఈ కోవిడ్ పరిస్థితులలో జోన్‌లోని కుటుంబాలు, విద్యార్థులను దేవుడు కాపాడుతూ వచ్చినందుకు, ఆన్‌లైన్ ఇజియఫ్, బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగుతున్నందుకు, పరిచర్యకు విరాళాల్ని క్రమంగా పంపించగలుగుతున్నందుకు, జరిగిన గాస్పల్ ఈవినింగ్‌ను బట్టి, ప్రతిరోజు కలిగియుంటున్న ప్రార్థన కూడిక, బ్రదర్ షద్రక్ మరియు సిస్టర్ గోవర్థిని కుటుంబాలు కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకున్నందుకు స్తుతించండి.

అందరి కాపుదల, భద్రత, జరగనున్న పరిచర్య, గాస్పల్ ఈవినింగ్‌లో రక్షణ పొందిన వారి ఫాలో అప్, విద్యార్థుల ఆత్మీయ ఎదుగుదల, సహవాసం, బ్రదర్ అనిల్ కుటుంబ ఆదరణ కొరకు, సిస్టర్ నిర్మల ఆరోగ్యం, నిరుద్యోగ మరియు అవివాహిత గ్రాడ్యుయేట్స్ కొరకు ప్రార్థించండి.

**హెచ్‌సియు:** మే 1 న 'ఈవిల్ అండ్ సఫరింగ్స్' పై జరిగిన టాక్, హాజరైన 35 మందిని బట్టి స్తుతించండి.

అందరి కాపుదల, భద్రత, విదార్థుల సాక్ష్య జీవితం, కోవిడ్‌తో బాధపడుతున్న వారు త్వరగా కోలుకొనేటట్లు, ఇయు విద్యార్థులు తమ చదువు, రీసర్చ్‌లపై దృష్టి నిలిపి ప్రభువు మహిమార్థమై సాక్ష్య జీవితాన్ని కలిగియుండునట్లు, నూతన ఇయు మరియు ఇజియఫ్ కమిటీ ఏర్పాటు కొరకు ప్రార్థించండి.

**అగ్రికల్చర్ యూనివర్శిటీ:** ఈ కోవిడ్ పరిస్థితులలో దేవుడు కుటుంబాలు, విద్యార్థులను కాపాడుతూ వచ్చినందుకు, ఇజియఫ్ మరియు బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగుతున్నందుకు స్తుతించండి.

విద్యార్థుల ఆత్మీయ జీవితం మరియు ఆర్థిక అవసరాలు తీరునట్లు, ఔట్‌గోయింగ్ విద్యార్థుల భవిష్యత్తు, గ్రాడ్యుయేట్స్ కుటుంబాల కొరకు ప్రార్థించండి.

**ఖైరతాబాద్:** బ్రదర్ ప్రణవ్ కుమార్ తండ్రి గారి ఆరోగ్యం నిలకడగా ఉన్నందుకు స్తుతించండి.

ప్రణవ్ కుమార్ తండ్రి గారు కిడ్నీ సంబంధిత వ్యాధి నుండి పూర్తిగా కోలుకొనునట్లు, అలాగే వారి కుటుంబ రక్షణ కొరకు ప్రార్థించండి

**తెలంగాణ**

రీజినల్ కో-ఆర్డినేటర్: సహో. కె. శ్రీనివాస్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్:
ఆదిలాబాద్ - సహో.లూథర్ కింగ్
కరీంనగర్ - సహో.డి.రాము
స్టాఫ్:
కరీంనగర్ - సహో.ఎన్.మోహన్ & సహోదరి స్నేహ లత
స్టాఫ్ కో-ఆర్డినేటర్ : ఆదిలాబాద్ - సహో. సి.రఘుపతి
స్టాఫ్ కో-ఆర్డినేటర్ : మంచిర్యాల - సహో. కె.కిరణ్ కుమార్

**కాటారం:** జరుగుతున్న ప్రాతఃకాల ప్రార్థన, బిబియస్, ఇజియఫ్, యంపిసిలు క్రమంగా జరుగుతున్నందుకు, జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపికైన బ్రదర్ రాము, లేడిగ్రాడ్యుయేట్ మెంబర్‌గా ఎంపికైన సిస్టర్ జ్యోతిలను బట్టి స్తుతించండి.

డిసిగా బ్రదర్ రాము, మెంబర్‌గా సిస్టర్ జ్యోతి వారి టర్మ్‌లో పరిచర్య బాగా చేయునట్లు, బ్రదర్ రాము నాన్న మరియు అన్న కుటుంబం కొరకు, సింగిల్ గ్రాడ్యుయేట్స్ భవిష్యత్తు, అందరి ఆరోగ్యం కొరకు ప్రార్థించండి.

**కరీంనగర్:** కోవిడ్ నుంచి కోలుకున్న స్టాఫ్ బ్రదర్ మోహన్ గారి తల్లి, సిస్టర్ ఫ్లోరెన్స్ మరియు ఆమె కుమారుడు మింటును బట్టి, పరిచర్య క్రమంగా జరుగుతున్నందుకు స్తుతించండి.

సిస్టర్ ఫ్లోరెన్స్ తల్లిగారు కోవిడ్‌తో చనిపోయి నందున కుటుంబ ఆదరణ కొరకు, బ్రదర్ ప్రవీణ్ కుటుంబానికి దేవుడు బిడ్డను అనుగ్రహించునట్లు, బ్రదర్ రాజేష్ ఉద్యోగం కొరకు, సిస్టర్ ఉమారాణి ట్రాన్స్‌ఫర్, కోవిడ్‌తో బాధపడుతున్న మిల్కి త్వరగా కోలుకునేటట్లు ప్రార్థించండి.

**జేఎన్‌టీయూ, కొండగట్టు:** ఈ కోవిడ్ పరిస్థితులలో దేవుడు కుటుంబాలు, విద్యార్థులను కాపాడుతూ వచ్చినందుకు స్తుతించండి.

బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగునట్లు, క్యాంపస్‌లో విశ్వాస విద్యార్థులు పరిచర్యలో చొరవ చూపుతూ తమ జీవితంలో దేవుని చిత్తానికి అనుగుణంగా జీవించునట్లు ప్రార్థించండి.

**సిరిసిల్ల:** ఈ కోవిడ్ పరిస్థితులలో దేవుడు

కుటుంబాలు, విద్యార్థులను కాపాడుతూ వచ్చినందుకు స్తుతించండి.

విద్యార్థుల ఆత్మీయ జీవితం, ఆర్థిక అవసరాల కొరకు, ఇజియఫ్ మెంబర్స్‌కు కోవిడ్ నుంచి దేవుని కాపుదల, బైబిల్ స్టడీస్ మరియు యంపిసిలు క్రమంగా జరుగునట్లు, అందరి కాపుదల కొరకు ప్రార్థించండి.

**నార్త్ తెలంగాణ**

రీజినల్ కో–ఆర్డినేటర్: సహో. ఆర్. వినయ్ కుమార్
డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్స్: నిజామాబాద్ – సహో. జి. మహారాజ్
మెదక్ – సహో. పి. నరేందర్
స్టాఫ్:
సంగారెడ్డి – సహో.సి. హెచ్.ప్రభాకర్
స్టాఫ్ ఆన్ ప్రొబేషన్: కామారెడ్డి–సహో.సి.సిహెచ్.నాగరాజ్

**నిజామాబాద్ జోన్:** ఈ కోవిడ్ పరిస్థితులలో జోన్‌లోని కుటుంబాలు, విద్యార్థులను దేవుడు కాపాడుతూ వచ్చినందుకు, కోవిడ్ నుండి కోలుకున్న బ్రదర్స్ రాంబాబు, మధు కుటుంబం, రాజారత్నం, స్టాఫ్ బ్రదర్ రవి కుటుంబమును బట్టి స్తుతించండి.

కోవిడ్ నుండి అందరి కాపుదల మరియు భద్రత, విద్యార్థుల చదువు మరియు భద్రత, జరగనున్న పరిచర్య, పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న గ్రాడ్యుయేట్స్ పిల్లల కొరకు, అవివాహిత మరియు నిరుద్యోగ గ్రాడ్యుయేట్స్ కొరకు ప్రార్థించండి.

**సౌత్ తెలంగాణ**

రీజినల్ కో–ఆర్డినేటర్: సహో. వెంకన్న
డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్స్: నల్గొండ – సహో. సి.హెచ్. రాబర్ట్
మహబూబ్‌నగర్ – సహో. వెంకటస్వామి
స్టాఫ్:
నల్గొండ – సహో.యన్.శ్రీనివాస్ & సహోదరి ఉష
స్టాఫ్ ఆన్ ప్రొబేషన్: మహబూబ్‌నగర్ – సహో. రాజ్ కుమార్
స్టాఫ్ కో–ఆర్డినేటర్: సూర్యపేట – సహో.సుధాకర్

**షాద్‌నగర్:** బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగుతున్నందుకు స్తుతించండి.

సునీత, స్పర్ష, గోల్డి ఆత్మీయ ఎదుగుదల కొరకు, గ్రాడ్యుయేట్స్ పరిచర్య, కుటుంబం, సంఘం, ఉద్యోగమును బ్యాలెన్స్ చేసుకొనునట్లు ప్రార్థించండి.

**జడ్చర్ల:** ఈ కోవిడ్ పరిస్థితులలో దేవుడు కుటుంబాలు, విద్యార్థులను కాపాడుతూ వచ్చినందుకు, ఆన్‌లైన్‌లో యంపిసిలు మరియు ఇజియఫ్‌లు క్రమంగా జరుగుతున్నందుకు స్తుతించండి.

నూతన విద్యార్థుల కాంటాక్ట్స్, విద్యార్థుల చదువు, ఆత్మీయ జీవితం, సింగిల్ గ్రాడ్యుయేట్స్ భవిష్యత్తు, అందరి కాపుదల మరియు భద్రత కొరకు ప్రార్థించండి.

**నల్గొండ:** ఇంతవరకు దేవుని నడిపింపు మరియు కాపుదలను బట్టి, నార్కెట్‌పల్లిలో ఇబియస్ ఆరంభమైనందుకు, అనారోగ్యం నుండి కోలుకొని హాస్పిటల్ నుండి డిశ్చార్జ్‌యైన బ్రదర్ మల్లేష్‌ను బట్టి, బ్రదర్ రామకృష్ణ, సిస్టర్ ప్రభావతిల నూతన గృహ రిజిస్ట్రేషన్ పూర్తయినందుకు స్తుతించండి.

పరిచర్యలో దేవుని సహాయం, అందరికి దేవుని కాపుదల, సిస్టర్ జ్యోతి గారి తండ్రి జీవయ్య కిడ్నీ సమస్య మరియు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ నుండి స్వస్థత పొందునట్లు, స్టాఫ్ బ్రదర్ ప్రభాకర్ కుటుంబ ఆదరణ కొరకు ప్రార్థించండి.

**ఈస్ట్ తెలంగాణ**

రీజినల్ కో–ఆర్డినేటర్: సహో.వేణు
డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్స్:
ఖమ్మం – సహో.దయాకర్
వరంగల్ – సహో.యం.అనీల్
స్టాఫ్:
వరంగల్ – సహో.జి.సందీప్ & సహోదరి సుమ సింధూరి
స్టాఫ్ కో–ఆర్డినేటర్: ఖమ్మం – సహో.పి.నాగేశ్వరరావు

**వరంగల్ అర్బన్:** ఈ కోవిడ్ పరిస్థితులలో అందరి కుటుంబాలు, విద్యార్థులను దేవుడు కాపాడుతూ వచ్చినందుకు, ఇంతవరకు పరిచర్యలో దేవుని నమ్మకత్వం మరియు నడిపింపును బట్టి స్తుతించండి.

అందరి కాపుదల మరియు భద్రత, ఆన్‌లైన్ ద్వారా పరిచర్య ఫలభరితంగా జరుగునట్లు, స్టాఫ్ బ్రదర్ రాజేష్ తల్లిదండ్రుల ఆరోగ్యం కొరకు, విశ్వాస విద్యార్థుల ఆత్మీయ ఎదుగుదల, ఆర్థిక అవసరాలు, సిస్టర్ లత గారి ఇద్దరు సోదరీలు, బావ కోవిడ్ నుండి కోలుకొనునట్లు, విద్యార్థుల చదువు కొరకు, మెడికల్ ఫీల్డ్‌లో ఉన్న గ్రాడ్యుయేట్స్‌కు కాపుదల, నూతన స్టాఫ్ కొరకు, సింగిల్ గ్రాడ్యుయేట్స్ భవిష్యత్తు, పరిచర్యలో అందరి చొరవ కొరకు ప్రార్థించండి.

**భద్రాచలం:** ఆన్‌లైన్‌లో జరుగుతున్న బైబిల్ స్టడీస్‌ను బట్టి స్తుతించండి.

బైబిల్ స్టడీస్ అర్థవంతంగా కొనసాగునట్లు, పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు, గురుకుల డిగ్రీ కాలేజిలోని జూనియర్ విద్యార్థులు ప్రభువు కోసం నిలబడునట్లు ప్రార్థించండి.

### Premier Institutes

1. Praise God for the regular Bible studies at IIT and for the students' initiative.
2. Praise God that other university (Urdu University, BITS) students are attending the IIT Bible study.
3. Praise God that we have a weekly time of fellowship for IICT research scholars.
4. Pray that we may have a University Engagement program to have a dialogue with non-Christian students about issues on the campuses and student related.
5. Pray for good ministry at IIT Hyderabad, exclusive BBS and EBS at Urdu University, BITS, EFLU, NALSAR.

### Urban Students Department

1. Praise God for the regular Bible studies at Kompally and Tarnaka.
2. Praise God that we could start Teens weekly Bible study for RR District and it's happening regularly every Sunday at 6 pm over zoom with 15-20 students.
3. Kindly pray as we have a special gathering on the topic, "God, the grand designer of our lives" with Mr. Benny Prasad, Bangalore on 30th May.
4. Pray for Bible studies to be started across the region for Teens and the city-bred.

### Neighbors

1. Praise God for the Neighbors envisioning program that happened in the various zones.
2. Pray that Neighbors Interested Groups (NIGs) may start across the state wherever there is scope.
3. We planned a pre-evangelistic series for the Urdu university students. Kindly pray.
4. Pray for the comparative study forum of Bible and Quran for interested graduates and students which happens once a month.

### FIS: International Students

1. Praise God for the meetings with the students every week.
2. Pray that God may open doors to break new grounds.
3. Pray that we may have a refresher program for international students.
4. Pray that students who have gone to their countries should have proper fellowship and settlement in life.



### ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు విజ్ఞప్తి

జులై నెలలో వచ్చే ప్రార్థనాంశలకు జూన్ 15వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు editorvv2018@gmail.com కు పంపించగలరు.



# ఆధ్యాత్మికంగా, మానసికంగా వికసించుటకు దేవుడు కృప చూపించాడు

– ఐ. నళిని ప్రసన్న కుమార్

దేవుని కృపలో దైవభక్తి గల తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ సంరక్షణలో బాల్యంలో ఆత్మ పునాది వేయబడింది. ఉదయ సాయంత్రాలు కుటుంబ ప్రార్థన, కంఠత వాక్యాలు నేర్చుకోవడం, సంఘ ఆరాధనలు, తరచుగా సేవకుల ద్వారా గృహ ప్రార్థన సమావేశాలు, వ్యక్తిగత వాక్య ధ్యానం, ప్రార్థనతో పాటు ఉజ్జీవ సభలకు తప్పక హాజరయ్యే వారం. దేవుని యందు భయభక్తులు, దాతృత్వం, సంతృప్తి, ఆతిథ్యం, షేరింగ్ వంటి లక్షణాలను నేర్పిన మా తల్లిదండ్రులు మాకు రోల్ మోడల్స్.

తల్లి, అక్క, అన్నయ్య ఇ.యు పరిచర్యలో ఉండేవారు. రక్షణ పొందిన తర్వాత దేవుని చిత్తంలో బ్రదర్ ఐ.పి.ప్రసన్న కుమార్ గారిని వివాహం చేసికొనుట జరిగినది. 1978లో

> ప్రేమను వ్యక్తపరచుకుంటూ, సద్విమర్శలను అంగీకరిస్తూ దేవుని సహాయంతో వివాహ జీవితాన్ని కొనసాగించుచున్నాం.

రాజమహేంద్రవరంలో ఇ.యు పరిచర్య ప్రారంభించుటకు దేవుడు మమ్మును, మా సోదరి డా.జయశ్రీ ఫిలిప్ కుటుంబమును వాడుకున్నారు.

రక్షణ పొందిన తొలి దినాలలో దేవునిని అధికంగా ప్రేమించడంతో పాటు సహవాసం చేయడం, మౌనధ్యానం, పిబియస్, ఆసక్తితో ప్రార్థన చేయడం, సహవాస కూడికలకు క్రమం తప్పకుండా వెళ్లడం ఇష్టంగా ఉండేది.

ఇ.యు పరిచర్యలో ఎక్కువగా పాల్గొనుట, దేవుని చిత్తానికి లోబడి పనిచేస్తూ, పరిశుద్ధంగా జీవించాలనే కోరిక, అన్ని విషయాలలో దేవుని సంతోషపెట్టుటకు ప్రయత్నించుట జరిగేవి.

సంఘంలో చురుగ్గా పాల్గొంటూ బైబిల్ స్టడీస్ తీసుకోవడం, వాక్య పరిచర్య, క్యాంపులు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించడంలో సహకారం, పరిచర్యకు ఇంటిని ఓపెన్ హోమ్‌గా తెరిచి ధనాన్ని, సమయాన్ని వెచ్చించడం మరియు తలాంతులను ఉపయోగిస్తూ ఆనందించేవారం.

తర్వాత కుటుంబ బాధ్యతలు పెరిగి, పిల్లలను దేవుని భయభక్తులలో నడిపించుట, క్రమంగా సండేస్కూలుకు పంపించుట, రక్షణానుభవంలోనికి నడిపించడం జరిగింది.

కుటుంబంగా ఇ.యు, ఇ.జి.యఫ్ రిట్రీట్స్, కాన్ఫరెన్స్‌లకు హాజరవ్వడమే కాకుండా, యు.ఇ.యస్.ఐ సిల్వర్ జూబ్లీ, గోల్డెన్ జూబ్లీకు హాజరయ్యే భాగ్యం కలిగింది. ప్రొఫెసర్ ఇనాక్ గారిని కూడా చూడగలిగాం.

విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్‌తో గడిపే సమయాలు, వారితో కలిసి ప్రార్థించుట, సంతోషంగా ఆత్మకు మేలుకరంగా ఉండేవి. దాంతో ఇల్లు కలకలలాడుతూ ప్రేమ, ఆప్యాయతలతో అరమరికలు లేకుండా ఒక కుటుంబంలా ఉండేవారం.

కష్టాలలో, సమస్యలలో ఉన్నవారు, కుటుంబాలు వచ్చి షేర్ చేసుకుంటూ ఉంటారు. వారిని కౌన్సిల్ చేసినప్పుడు వారు దేవుని సహాయంతో అధిగమించగలిగేవారు.

ఉదయ సాయంత్రాలు కుటుంబ ప్రార్థన, ఇద్దరం కలిసి ప్రార్థన చేసుకోవడం, బైబిల్ గురించి చర్చ మమ్మల్ని విశ్వాస జీవితంలో స్థిరపరచి బలపరుస్తున్నాయి. దేవుని కృప, కుటుంబ సహకారం, ఇ.జి.యఫ్, యు.ఐ.యస్.ఐ బోధనలు, సహవాసం, సంఘం ఆత్మీయంగా పురిగొల్పి ముందుకు నడిపిస్తున్నాయి.

వివాహమైన తొలి రోజుల్లో చాలా సంతోషంగా, ప్రేమగా, ఆప్యాయంగా భావాలు పంచుకోవడం, ఎక్కువ సమయం కలిసి గడపడం, ఒకరి మాట ఒకరు వినడం, ఒకరినొకరం సంతోషపెట్టాలని చూడ్డం, సరదాగా బయటికి వెళ్లడం జరిగేది.

మొదట్లో అత్తమామల విషయాల్లో కొంత అనెమ్మది కలిగినా భర్త అండతో సమస్యలను సున్నితంగా, సామరస్యంగా పరిష్కరించుకోగలిగాం.

పిల్లలు కలిగిన తర్వాత బాధ్యతలు, పని ఒత్తిడి పెరిగి, కోపంగా మాట్లాడుకోవడం, సంతోషం లేకపోవడం జరిగేది.

గొడవలు, ఉద్రిక్త వాతావరణంలో ఒకరం మౌనం వహించి, తగ్గించుకొని, ప్రశాంతంగా ఉన్న సమయంలో తప్పొప్పులను చర్చించుకుని, ఇద్దరం కలిసి ప్రార్థించి ఒకరినొకరం క్షమించుకొనేవారం. కష్టాలలో దుఃఖ సమయాలలో ఒకరినొకరం వాక్యం ద్వారా బలపరచుకొని ధైర్యం, ఆదరణ పొందేవారం.

పిల్లలకు మంచి నడవడి నేర్పుతూ, దేవుని భయభక్తులలో పెంచుటకు ఇద్దరం శ్రద్ధ వహించేవారం. తగినంత స్వేచ్ఛ ఇస్తూనే క్రమశిక్షణ చేసేవారం. స్నేహితులను గమనిస్తూ చదువులను పర్యవేక్షించే వాళ్ళం. మా ఇద్దరు కుమారులు సంఘంలో సండేస్కూల్, యూత్‌ని నడిపించేవారు. మంచి క్రైస్తవ విలువలు నేర్చుకున్నారు.


వివాహ విషయంలో దేవుని చిత్తం చేశారు. కట్నం తీసుకోకుండా దేవుని మహిమార్థం వివాహాలు జరిగాయి. వారు కుటుంబాలతో ఇయు పరిచర్యలో పాల్గొంటున్నారు, పదవి విరమణ తరువాత గ్రాండ్ చిల్డ్రన్‌కు సేవలు అందిస్తూ, వారిని దేవుని భయభక్తులలో నడిపించగలుగుతున్నాం.

ఇటీవల మే ఒకటి నుంచి కరోనా పాజిటివ్‌తో సీరియస్ కండిషన్లో ఉన్న మా చిన్న కుమారుడు షిమీ ప్రీతం కొరకు వేలాది మంది యు.ఇ.యస్.ఐ ప్రియులు ప్రార్థించుట ద్వారా గొప్ప స్వస్థత నా దేవుడు అనుగ్రహించాడు.

మా 43 సంవత్సరాల వివాహ జీవితంలో దేవుడు తన కృపను అత్యధికంగా కనపరచి సంతోష సమాధానాలతో ప్రశాంతంగా జీవించడానికి సహాయం చేశారు. ఒకరికొకరం ప్రాధాన్యతనిస్తూ, పరస్పర భావాలను అర్థం చేసుకుంటూ. ప్రేమను వ్యక్తపరచుకుంటూ, సద్విమర్శలను అంగీకరిస్తూ దేవుని సహాయంతో వివాహ జీవితాన్ని కొనసాగించుచున్నాం.

దేవునితో మరింత సన్నిహితంగా జీవిస్తూ, ఆయన వద్దకు వెళ్ళే సమయం కొరకు సిద్ధపడుతున్నాం. సకల మహిమ, ఘనత ఆయనకే చెల్లును గాక! ●

**ఐ. నళిని ప్రసన్న కుమార్,** రాజమహేంద్రవరం ఇజియఫ్




# విలియం కేరీ

– రూత్ వినయ్

విలియం కేరి మిషనరీగా వచ్చి 200 సం॥రాలు దాటింది. ఆయన భారతదేశాన్ని ఎంతో ప్రభావితం చేశాడు. అయినప్పటికీ ఇంకా మిలియన్ల కొద్దీ భారతీయులు సువార్త అందని ప్రజలుగా ఉన్నారు. దేవుని ప్రేషిత ఆజ్ఞకు లోబడి ఆయన సువార్త ప్రకటించడానికి యువతీ యువకులు ముందుకు రావాల్సిన సమయం ఇదే.

ఆధునిక మిషనరీ ఉద్యమానికి పితామహునిగా పిలువబడే విలియం కేరి, 41 సం॥లు కష్టించి బైబిల్‌ను బెంగాలీ భాషలోనికి అనువదించాడు. కేరీ షూ మేకర్‌గా తన జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత పాస్టర్‌గా ఇంగ్లీష్ బాప్టిస్ట్ సొసైటీని స్థాపించాడు. అతడు వృక్ష శాస్త్రజ్ఞుడు, విద్యావేత్త, రచయిత, సామాజిక సంస్కర్త మరియు ప్రింటింగ్ ప్రెస్‌ను భారతదేశానికి తీసుకువచ్చిన మొదటి వ్యక్తిగా కూడా చెప్పవచ్చు.

## బాల్య జీవితం

క్రీస్తు శకం 1761 లో విలియం కేరీ ఇంగ్లాండ్‌లో జన్మించాడు. అతని తల్లిదండ్రులు ఎడ్మండ్ మరియు ఎలిజిబెత్‌లు నేత కార్మికులుగా ఉండేవారు. వారి

> అతడు నిజాయితీ, నైపుణ్యం గల పనివాడు. అతని వృత్తిని గురించి అతడు ఎప్పుడూ సిగ్గుపడలేదు.

కుటుంబంలోని ఐదుగురు సంతానంలో విలియం పెద్దవాడు. విలియం 6 సం॥రాల వయసులో అతని తండ్రి ఆ గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా నియమించబడ్డాడు.

చిన్న వయస్సులో, విలియం చారిత్రాత్మక, శాస్త్రీయ పరిజ్ఞానం పట్ల ఎంతో ఆసక్తి కలిగి ఉండేవాడు. కానీ 12 సం॥రాల వరకు అతడు ఎటువంటి విద్యను పొందలేదు. అతడు తన సొంతంగా అనేక పుస్తకాలను చదివే అభిలాషను అలవర్చుకున్నాడు. సాహస ప్రయాణాలు, మొక్కలను గూర్చిన పుస్తకాలు అనేకం చదివేవాడు. అతడు అడవులలో, పొలాలలో తిరుగుతూ, జంతువులను, పక్షులను గమనిస్తూ ఉండేవాడు. ఏదైనా పని సంపూర్తిగా చేయాలనే సంకల్పం కలిగి ఉండేవాడు. కేరీ యొక్క ఆరోగ్య పరిస్థితి అతనిని వ్యవసాయ పనుల్లో పాల్గొనడానికి సహకరించలేదు. కనుక 14 సం॥రాల వయసులో అతని తండ్రి అతనికి షూ మేకర్‌గా శిక్షణ ఇచ్చాడు. విలియం నిజాయితీ మరియు నైపుణ్యం గల పనివాడు. ఈ వృత్తిని గురించి అతడు ఎప్పుడూ సిగ్గుపడలేదు. అతడు 17 ఏళ్ళ వయసులో ఉన్నప్పుడు షూ తయారీలో సహ అప్రెంటిస్‌గా ఉన్న జాన్ వార్ అనే యువకుడు విలియంకు బైబిల్ పరిచయం చేశాడు.

"నా హృదయం గర్వం కలిగి చెడిపోయి ఉంది. హృదయ మార్పు తప్ప మరి ఏమీ నాకు మంచి చేయదు'' అని తాను క్రీస్తు వద్దకు వచ్చిన అనుభవాన్ని పేర్కొంటాడు. అతనికి క్రీస్తు సువార్తను తెలియజేసిన 'జాన్ వార్' కు తెలియదు 'భారత ఆభరణాలకు క్రీస్తు వజ్రాన్ని చేర్చే వ్యక్తిని' దేవుని కొరకు గెలుచు కుంటానని.

నూతన వ్యక్తిగా మారిన తర్వాత విలియం బైబిల్ అధ్యయనం చేయడం ప్రారంభించాడు. షూ మేకర్‌గా వృత్తిని కొనసాగిస్తూ అనేకమైన ఇతర క్రొత్త భాషలను నేర్చుకునేవాడు. అతడు తనకు 31 సం॥రాల వయసు వచ్చే సరికి లాటిన్, గ్రీక్, హిబ్రూ, ఇటాలియన్, ఫ్రెంచ్ సహా 7 భాషలలో బైబిల్ చదవగలిగాడు. విలియం కేరికి బైబిల్‌లో ఇష్టమైన అధ్యాయం యెషయా 54. ఆ అధ్యాయం తన పరిచర్య కాలం అంతటిలో అతనికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది.

## భారతదేశంలో పయనీరింగ్ పరిచర్య

విలియం కేరి డాక్టర్ థామస్‌తో కలిసి నవంబర్ 1793లో, తన కుటుంబంతో సహా 5 నెలల సుదీర్ఘ కాలం ప్రయాణించి కలకత్తా నగరానికి చేరుకున్నాడు. వారు వచ్చిన ప్రారంభ దినాలలో కలకత్తా నగరం వెలుపల ఎంతో కష్టతరమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆర్థికంగా సహాయకరంగా ఉండునట్లు అతడు ఒక ఇండిగో ఫ్యాక్టరీలో మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించాడు. భారత దేశ ప్రజలకు రక్షకుని యొక్క అవసరాన్ని గుర్తెరిగాడు కేరీ. 'సతి' వంటి అనేక సనాతన సంప్రదాయాలు అతని హృదయాన్ని కదిలించి వేశాయి. అతడు 'సతి'కి వ్యతిరేకంగా 1829 వరకు ఎంతో సుదీర్ఘమైన పోరాటాన్ని చేశాడు.

1800, జనవరి నెలలో అతడు కుటుంబంతో సహా సిరంపూర్‌కు వెళ్ళాడు. అతనితోపాటు జాషువా మార్ష్ మన్, విలియం వార్డ్‌లు కూడా ఆ ప్రదేశానికి వచ్చారు. అప్పుడున్న ఈస్టిండియా కంపెనీ వారు మిషనరీలను అనేక విధాలుగా ఆటంకపరిచేవారు. ఆ సంవత్సరం చివరి నాటికి క్రిష్ణ పాల్ అనే ఒక హైందవ వ్యక్తి క్రీస్తును అంగీకరించాడు. విలియం కేరీ అతని స్నేహితులు దేవుని నమ్మకత్వం పట్ల ఎంతో సంతోషించారు.

సిరంపూర్‌లో విలియం కేరీ ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించాడు. అతని బృందంతో కలిసి 44 భాషల్లో బైబిల్‌ను అనువదించాడు. వ్యాకరణాలను, నిఘంటువులను అనేకం ముద్రించాడు. 26 సంఘాలను, 126 పాఠశాలలను గ్రామ గ్రామాలలో స్థాపించారు. వైద్యశాలలను, సేవింగ్ బ్యాంక్స్, వేదాంత పాఠశాలలను, బాలికలకు ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పారు. బెంగాలీ భాషలో న్యూస్ పేపర్‌ను వెలువరించారు.

## విలియం కేరి డైరీలో ఒక రోజు

"ఉదయం 5:45కు నిద్ర లేచాను. హిబ్రూ బైబిల్‌లో ఒక అధ్యాయం అధ్యయనం చేసి 7 గం॥ల వరకు వ్యక్తిగత ప్రార్థనలో సమయం గడిపాను.

దేవునికి ప్రత్యేక విజ్ఞాపనలు, కుటుంబ ప్రార్థనలో బెంగాలీ సహాయకులతో కలిసి ప్రార్థించాను. టీ సమయం వరకు పర్షియన్ భాష చదివాను. 10 నుంచి 2 వరకు హిందుస్తానీ భాష నుండి సంస్కృతంలోనికి లేఖనాలను అనువదించాను మరియు ఒక కళాశాలలో బోధించాను. ఆ తరువాత యిర్మియా గ్రంథాన్ని బెంగాలీ భాషలోనికి అనువదించిన ప్రతులను సవరించాను. ఒక గంట సమయం పండితుని వద్ద తెలుగు భాష నేర్చుకున్నాను. మత్తయి సువార్తలోని కొంత భాగాన్ని సంస్కృతంలోకి అనువదించాను. 7 గంటలకు తరువాత జరగబోయే సమావేశంలో మాట్లాడటానికి తలంపులను కొన్నిటిని సేకరించాను. 7.30 గంటలకు 40 మంది ఉన్న సమావేశం నిర్వహించి, బెంగాలీ అనువాదం 11 గంటల వరకు నిర్వహించాను. ఇంటికి ఒక ఉత్తరాన్ని వ్రాసి, గ్రీకు నూతన నిబంధనలోని ఒక అధ్యాయాన్ని చదివి నిద్రకు ఉపక్రమించాను". సాధారణంగా విలియం కేరి యొక్క దినచర్య ఇది.

## సేవా పొలంలో కేరీ

1802వ సం॥లో క్రిష్ణ పాల్ కుమార్తె యొక్క వివాహం ఒక బ్రాహ్మణుడితో జరిగింది. అనేకులు ఆ కులాంతర వివాహాన్ని ఆటంకపరిచారు. అయినప్పటికీ, అనేక హైందవులు క్రీస్తును రక్షకునిగా స్వీకరించారు. కేరీ అక్కడి ప్రజల జీవితాలను బాగు చేయడమే ధ్యేయంగా పని చేశాడు. అక్కడ ఇంగ్లీష్ వారితో కలిసి అనేక ఫ్యాక్టరీలను నెలకొల్పాడు. దాని మూలంగా కొన్ని వేల మందికి ఉపాధి కల్పించాడు. 1818లో సిరంపూర్‌లో సంఘ నాయకులను తర్ఫీదు చేయుటం కొరకై వేదాంత కళాశాలను ప్రారంభించాడు. 1820లో అగ్రికల్చర్ మరియు హార్టికల్చర్ సొసైటీని స్థాపించాడు. 1824–1826 వరకు దాని ప్రెసిడెంట్‌గా కొనసాగాడు. నూతన పద్ధతిలో వ్యవసాయాన్ని ప్రోత్సహించాడు. అనేక ఉపయోగకరమైన పంటలను పరిచయం చేశాడు.

## పరిచర్యలో ఎదుర్కొన్న కష్ట నష్టాలు

కేరీ ఎక్కువ సమయాన్ని బైబిల్‌ను వివిధ భాషల్లోకి అనువదించడంలో గడిపేవాడు. ప్రజలందరూ దేవుని వాక్యాన్ని చదవాలనే ఆకాంక్ష అతనికి ఉండేది. 1812లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రచురణ విభాగంలోనే ప్రతులన్నీ కాలిపోయాయి. కేరీ అతని బృందం 15 సం॥లు కష్టపడి చేసిన అనువాదాలు అన్నీ బూడిద పాలయ్యాయి. కానీ వారు నిరుత్సాహ పడకుండా మరో 7 సం॥లు కష్టపడి తిరిగి వాటిని అనువాదం చేశారు.

తన పరిచర్య అంతటిలో ప్రభుత్వం నుండి, ప్రజల నుండి ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు కేరీ. తన వ్యాపారంలో కూడా అనేకసార్లు నష్టపోయాడు. 1812లో ఆదోనిరామ్ మరియు ఆన్ జడ్సన్‌లు విలియం కేరి మిషనరీ స్థావరాన్ని దర్శించారు. కానీ అప్పటి యుద్ధ పరిస్థితుల కారణంగా వారు బర్మా దేశానికి వెళ్ళవలసి వచ్చింది.

కేరీ పిల్లలలో అనేక మంది వ్యాధుల బారిన పడి చాలా చిన్న వయసులోనే మరణించారు. అతడి మొదటి భార్య డోరతి 1807వ సం॥లో మానసిక వ్యాధికి గురై మరణించింది. 1813లో కేరి, షా చార్లెటిని వివాహం చేసుకున్నాడు. ఆమె విలియం కేరికి పరిచర్యలో ఎంతో సహాయ సహకారాలు అందించేది. 'ముత్యపు చిప్పలో దాగిన అగ్నితో నిండిన ఆత్మ' గా ఆమె కొనియాడబడినది.

## ముగింపు

41 సం॥లు భారతదేశంలో పరిచర్య చేశాడు విలియం కేరి. అతడు మరణించే నాటికి భారతదేశంలో 30 మంది మిషనరీలను, 40 మంది స్థానిక బోధకులను మరియు 600 వందల మంది సంఘ సభ్యులను దేవుని కొరకై సంపాదించ గలిగాడు. జూన్ 9, 1834లో సిరంపూర్ నందు విలియం కేరి ఎంతో సమాధానంతో ప్రభు సన్నిధికి కొనిపోబడ్డాడు. దేవుని పై అత్యంత ప్రేమ, భారత దేశ ప్రజల మీద గాఢమైన ప్రేమ కలిగిన వ్యక్తిగా విలియం కేరి పిలువబడ్డాడు. తాను మరణించక ముందు తన స్నేహితునితో ఈ విధంగా అన్నాడు కేరీ – "డాక్టర్ కేరీ మరియు అతని పనిని గురించి మీరు చాలా బాగా చెబుతున్నారు. నేను మరణించిన తర్వాత దయచేసి డాక్టర్ కేరీ గురించి కాకుండా, నా అద్భుతమైన రక్షకుని గురించి మాట్లాడండి".●

(పై వ్యాసం ఇంటర్నెట్ వనరుల ఆధారంగా వ్రాయబడింది)


రూత్ వినయ్, గర్ల్స్ మినిస్ట్రీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ మరియు కూకట్ పల్లిలో గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

# పుస్తక పరిచయం



| | |
|---|---|
| పుస్తకం పేరు | : విజయవంతంగా ప్రార్థించు |
| రచయిత | : చార్లెస్ స్పర్జన్ |
| పేజీల సంఖ్య | : 119 |
| పబ్లిషర్స్ | : జీవన్ జ్యోతి ప్రెస్ |
| ధర | : 35/- |
| అనువాదం | : డా.జోబ్ సుదర్శన్ |

– సి.చిన్న నాగరాజు




"మన దుఃఖాన్ని సంతోషంగా మార్చు కోవాలని, ఈ పోటీ ప్రపంచంలో ముందుకు దూసుకుపోవాలని, మన జీవితపు పెను తుఫానుల మధ్య ప్రశాంతతను అనుభవించాలని ప్రతి విశ్వాసి కోరుకుంటాడు. అలా కోరుకునే ప్రతి విశ్వాసి చదవవలసిన పుస్తకం."

చార్లెస్ స్పర్జన్ గారు రచించిన పుస్తకాలను చదవాలని నేను ఎంతగానో ఆశ కలిగి ఉండేవాడిని. ఎందుకనగా, ఆయనకు "ప్రసంగ చక్రవర్తి" అని పేరు. ఈ ప్రసంగ చక్రవర్తి పుస్తకాలను చదివి నేను కూడా ఆశీర్వదించబడాలని నా ఆశ, కోరిక. అయితే, ఈ ప్రసంగ చక్రవర్తి రాసిన "విజయవంతంగా ప్రార్థించు" అనే పుస్తకాన్ని చదివి నేను ఎంతో ప్రోత్సహించ బడ్డాను. ఈ పుస్తకంలో కేవలం ఐదు అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి అధ్యాయంలో ప్రభువుకు మనం ఎలా ప్రార్థించాలో వివరించబడ్డాయి. మొదటి అధ్యాయంలో, నేను ఎంత నలిగి పోయానో, ఎంత కుదురు లేని వాడనో దేవునికి వివరించాలని ఈ పుస్తకం ద్వారా గ్రహించాను.

నా ఆశలు కళ్లెం లేని గుర్రం లాగా దేవునికి ఎంత దూరం చేశాయో చెప్పమని, దేవుని దగ్గర ఏదీ దాచుకోకూడదని, ఏమి చేయాలో పాలుపోని స్థితిలో సైతం దేవునిపై నమ్మకం సడలనీయకూడదని, ఒంటరిగా సత్యం కోసం నిలబడే తత్వం కలిగియుండాలని నేర్చుకున్నాను. దైవ సేవకునికి దేవుడు అనుమతించే కష్టాలలో సగం లేక 90 శాతం వరకు అతని క్షేమం కొరకు కాదు గాని ఇతరుల క్షేమం కొరకని తెలుసుకున్నాను. రెండవ అధ్యాయంలో, ఆధ్యాత్మిక దీవెనల గొప్ప తలుపు ప్రార్థనేనని, మూడవ అధ్యాయంలో బాధలు లేని వ్యక్తిని దేవుడు విడిపించే ప్రసక్తి లేదు కాబట్టి బాధలో ఉండడం నాకు భాగ్యమని తెలుసుకున్నాను. నాలుగు, ఐదు అధ్యాయాలలో, దేవుడు సమయం ప్రకారం పని చేస్తాడని, తాను నియమించిన సమయానికి మించి ఒక్క క్షణం కూడా తన సేవకులను ఎదురుచూసేలా చేయడని, నిజమైన ప్రేమ బాటలో అన్నీ ముళ్ళేనని, నిజమైన నా విశ్వాస యాత్ర కూడా అనేక అవరోధాలతో కూడి ఉంటుందని నేర్చుకున్నాను.

చార్లెస్ స్పర్జన్ గారు రచించిన "విజయవంతంగా ప్రార్థించు" అనే పుస్తకం యవ్వన సేవకునిగా నాకు ఎంతగానో సహాయకరంగా ఉంది. నేను నా సేవా జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో నన్ను ఎంతగానో ప్రోత్సాహపరిచింది. తమ జీవిత కాలంలో దేవుడు మెచ్చే ప్రార్థనను చేయాలని కోరుకునే ప్రతి విశ్వాసి తప్పక చదవాలని విశ్వాసులందరికీ సిఫార్సు చేస్తున్నాను. •


సి.చిన్న నాగరాజు, స్టాఫ్, సిద్దిపేట

కవిత



# అక్షర సత్యం

ఆధ్యాత్మిక సాహిత్యం
అంతరంగాన్ని
అలవోకగా స్పర్శిస్తుంది
నిదరోతున్న ఆత్మీయతను
తట్టి లేపుతుంది

మస్తిష్క మండలంలో
ప్రసరించిన అక్షరవెలుగు
మసకబారిన మనసులో
మధ్యాహ్న సూర్యునిలా
ఆత్మీయకాంతిని వెదజల్లుతుంది

మెదడు భూమిలో
పాతుకున్న అక్షరవిత్తనం
విజ్ఞానంతో వికసించే
పరిజ్ఞాన మొగ్గలను
చిగురింపజేస్తుంది

నేడు తిరగేసిన
రెపరెపలాడే పేజీలు
మహోన్నత శిఖరాలను
అధిరోహించేందుకు
మనకిచ్చే ఆత్మీయరెక్కలు

మనసు పలక మీద
ముద్రించుకున్న సత్యాక్షరాలే
శ్రమల శోధనల్లో
కాపాడే అక్షరసత్యాలు

– ఎస్. ఈశ్వర్, ఆర్కిటెక్ట్, మెహదీపట్నం



# అందరూ బాగుండాలి అందులో మనముండాలి

- వి.శ్యామలా కృపారావు

టమేటాలూ, పచ్చిమిరపకాయలూ, వంకాయలూ... పాలకూర, మెంతికూరా, చుక్కకూరా అంటూ తనదైన యాసలో అరచుకుంటూ వస్తున్నట్లున్నాడు, బండి పైన కూరగాయలమ్మే యాదగిరి. ఆ కేకలు విన్నదేమో అమ్మ, “రవీ! రా నాన్నా ... యాదగిరి కూరగాయలు వచ్చినట్లున్నాయి. కొంచెం కిందకి వెళ్లి మంచివి చూసి ఏరుకుని తీసుకురా!” అంది. బ్రష్ చేసుకుంటున్న నేను దబదబా ఆ పని కానిచ్చి అమ్మ ఇచ్చిన డబ్బులు సంచి తీసుకుని కిందకి వెళ్ళా.

నమస్తే సార్! ఎట్లున్నరు? ఈయాళ ఆఫీసు లేదా? మీరొచ్చింర్రూ! అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు జవాన్ లాగా సెల్యూట్ చేస్తూ యాదగిరి. నమస్తే యాదగిరి... బావున్నావా? ఇంట్లో అందరూ క్షేమమేనా? అన్నాను. రోజూ అమ్మనే వచ్చేది కూరగాయలు కొనడానికి. ఈ వేళ నేను వెళ్ళాను కాబట్టి ఈ ప్రశ్నలడిగాను. అలా అడిగానో లేదో, ఏం బాగుంటాం సార్, ఈ కరోనా మస్తు పరేషాన్ జేస్తుంది. మాయన్న లక్ష్మన్న గురించి జెప్పినా కద సార్ మీకు... వరంగల్లా ఉంటడు... అన్నాడు. నా ముఖంలోని క్వశ్చన్ మార్కును చూసి మీకు కాదు అమ్మకు జెప్పిన. లక్షల్లో పైసలు ఖర్చయినయి సార్. మాయన్న కష్టపడి పొలం చూసుకుంటడు. నేనేమో ఈ కూరగాయలు అమ్మి బతుకుతున్న. ఊర్లా రెండెకరాల పొలం మా అయ్య మాకు ఇచ్చి పోయిండు. ఈ కరోనాతో మాయన్న ధావఖానలా చావుబతుకుల్లో ఉంటే ఒక ఎకరం అమ్మి పైసలన్ని తెచ్చి దవఖానలో పోసినాం. ఉన్న భూమి అమ్ముకుంటే మా బిడ్డలెట్ల బతుకుతరు సార్. పోనీ ఇన్ని పైసలు వాళ్ళ సేతుల్లో పోసినం గదా, మనిషి తిరిగొస్తాడు ఇంటకి అన్న భరోసా లేదు. నేను కూరకాయలు ఏరడం ఆపి అసలు ఇప్పుడెట్లున్నాడు మీ అన్న అన్నాను.

ఏం జెప్పమంటవు సార్. ఇక్కడే హైదరాబాద్‌లా ఒక ప్రైవేట్ ధావఖానలో జేర్చిన. మా వదిన కూడా మా యన్న ఉన్న ధావఖానలో బయటనే కాచుకొని ఉన్నది. పిల్లలు మాతో

ఉన్నరు. ఏ విషయం ఏం జెప్తలేరు. సాచురేషన్ లెవల్ మంచిగ లేదంట, అవేంటో స్టెరాయిడ్స్ ఇస్తున్నారంట. ఈ రెండు రోజుల కిందట ఏదో బ్లాక్ ఫంగస్ అటాక్ అయ్యిందని కూడా అంటున్నరు. ఇప్పటికి పది రోజులపైన అయ్యింది సార్. మా యన్నకు ముందుగానే జరా ఆయాసం ఉన్నది సార్, దాని వల్లనే ఎక్వయిందని డాక్టర్లు చెప్తుండ్రు... అన్నాడు భుజం మీద ఉన్న టవల్‌తో కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ. సారీ! యాదగిరి నీ కష్టాలన్ని మళ్ళీ గుర్తు చేశాను. రియల్లీ ఐమామ్ వెరిసారీ, మీ అన్న త్వరగా బాగా కోలుకొని ఇంటికి రావాలని మనసారా కోరుకుంటున్నాను. యేసు క్రీస్తును ప్రార్థిస్తున్నాను అన్నాను సానుభూతితో. అవును సారు పార్థన జెయ్యండి. ఏదో ఒక దేవుడు మన బాధలన్ని తీరుస్తే అంతే చాలు సారు. "అందరూ బాగుండాలి అందులో మనముండాలి" సార్ అన్నాడు యాదగిరి. యాదగిరి! నమ్మకముంచు ఆ నిజ దేవుడు తప్పకుండా ఈ పరిస్థితులు బాగుచేయగల సమర్థుడు. ఆయనకు అసాధ్యమైంది ఏమీ లేదు. ఆయన శక్తిమంతుడు. ఆయనెవరో, ఏంటో నీవు కూడా తెలుసుకోవాలి యాదగిరి. అమ్మ, మేము రోజు నీ కోసం ప్రార్థన చేస్తున్నాం యాదగిరి. అవును సార్ నాకు తెలుసు అమ్మ గురించి అన్నాడు యాదగిరి. అంతా బాగయ్యాక ఒకసారి వస్తాను సార్ దేవుని గురించి చెప్పుండ్రి అన్నాడు. తప్పకుండా అంటూ డబ్బులు యాదగిరికి ఇచ్చి సంచి పట్టుకొని వచ్చా.

ఏమంటున్నాడు యాదగిరి అంటూ నా చేతిలో సంచి తీసుకుంటూ అడిగింది అమ్మ. వాళ్ళ అన్న గురించి చెప్పాడు అని నేను చెప్పగానే, అవును రవీ! పాపం వాళ్ళు చాలా కష్టాల్లో ఉన్నారు. మనం కూడా ఏదైనా సాయం చేస్తే బావుంటుంది అన్నది. అమ్మా! ఇంతకు యాదగిరి ఏం చదువుకున్నాడు మెడికల్ టర్మ్స్ అన్నీ చాలా అనర్గళంగా మాట్లాడాడు. ఏమీ చదువుకోలేదు నాన్న, అన్ని చేతి లెక్కలే. నేను ఒకసారి అడిగితే ఏదో ఐదో తరగతి వరకు సర్కారు బళ్ళో చదివానని చెప్పాడు. కాని చాలా మెమరీ ఉంది తనకు. ఇంకా ఎంతివ్వాలో, ఎంతిచ్చామో, ఎపుడిచ్చామో అన్నీ చటుకున్న, కరెక్టుగా చెప్తాడు. చాలా మంచివాడు యాదగిరి. దేవున్ని తెలుసుకొంటే బాగుంటుంది అంది అమ్మ.

ఈ కరోనా పరిస్థితులే తనని ఇంత అప్‌గ్రేడ్ చేశాయని అన్పించింది ఏది ఏమైనా, ఎలా ఉన్నా ప్రతి మనిషి తన పరిస్థితులను బట్టి ఎంతో కొంత అప్‌గ్రేడ్ అవ్వడం చాలా ముఖ్యం అన్పించింది.

ఈ కోవిడ్ పరిస్థితులల్లో ఈవెన్ చర్చి మెంబర్స్ కొందరు అనుఎడ్యుకేటెడ్ అయినా కూడా చేతగాదని ఎవరూ ప్రక్కన కూర్చోలేదు. జూమ్ క్రియేట్ చేయడం, లింక్స్ ద్వారా జాయిన్ అవ్వడం, యూట్యూబ్ ఛానెల్స్, గూగుల్ మీట్, వెబెక్స్ ప్లాట్‌ఫాం ఏదయినప్పటికీ చాలా సులభంగానే... ఎటువంటి కష్టం లేకుండా అటెండ్ అవుతున్నారు. ఇంటర్నెట్ ఉపయోగించే జ్ఞానం వాళ్ళు కావాలని నేర్చుకోలేదు. పరిస్థితులే అలా నేర్చుకొనేలా చేశాయి. ఇదే విషయం అమ్మతో పంచుకున్నాను.



నువ్వు చెప్పింది ముమ్మాటికి నిజం నాన్నా. జ్ఞానం సంపాదించుకోవడం దేవుని చిత్తం. జ్ఞానం సంపాదించుకొనుము, బుద్ధి సంపాదించుకొనుము, నీ సంపాదన అంతయూ ఇచ్చి బుద్ధి సంపాదించు కొనుము, జ్ఞానమును కొనియుంచుకొనుము. జ్ఞానం గలవాడు బలవంతుడుగా ఉండును అని దేవుని వాక్యం చెబుతోంది. బైబిల్ చదవడం మాత్రమే కాదు మంచి మంచి పుస్తకాలు చదవడం, సాహిత్యం, శాస్త్రియం అందించే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి.

అమ్మా! ఈ మధ్య నా క్వయిట్ టైం కూడా యాంత్రికంగా ఉంటుంది. ఎందుకని? అన్నాను. బాగా ప్రార్థన చేసుకో నాన్నా. పరిశుద్ధాత్ముని సహాయం అడుగు. ఆయనే అన్నీ అవగాహన చేస్తాడు. మంచి కామెంటరీ, బుక్స్, ప్రభువుతో ప్రభాతం, లేఖనాలు పరిశోధించు, బైబిల్ డిక్షనరీ ఎన్నో ఉన్నాయి. మన దగ్గర ఉన్న వాటిని కూడా ఉపయోగించు. ఒక అంశం మీద మిగతా విశ్వాసుల వ్యూస్ చదివి తెలుసుకోవాలి. ఒక క్రొత్త కోణంలో ఆలోచించాలి. మనం చేసేది ఏపనైనా అది దేవునికి మహిమ తేవడమే గాక, కాస్త క్రియేటివ్‌గా ఉండాలి. ఎంత పరిజ్ఞానం సంపాదిస్తే అంతా క్రియేటివ్‌గా ఉండగలం.

ఇలా మెరుగు పెట్టిన బాణాలనే
దేవుడు తన అంబుల పొదిలో ఉంచుతాడు (యెష. 49:2)

తన పనిలో నైపుణ్యం గలవాడు మనుష్యుల యొదుట కాదు రాజుల యొద్దకు తేబడుతాడని మరో చోట బైబిల్లో రాయబడింది అన్నది చేతికి టిఫిన్ ప్లేటు అందిస్తూ. ఇంతలో డాడి ఒక బుక్స్ సెట్ తెచ్చి డైనింగ్ టేబులు మీద పెడుతూ "నా కుమారుడా జ్ఞానం సంపాదించుకొనుము... బుద్ధి సంపాదించుకొనుము అన్నాడు భుజం మీద తడుతూ. డాడీ మాటలకు నేను, అమ్మ పగలబడి నవ్వుకున్నాం. రవీ! మనం యాదగిరికి కొంత అమౌంటు పంపే ఏరాట్లు చూడు అన్నాడు డాడీ. ●

వి.శ్యామలా కృపారావు, టీచర్ మరియు ఎ.జి.జోన్‌లో గ్రాడ్యుయేట్‌గా ఉంటున్నారు

## వార్తలు

- గ్లోబల్ టీచర్ అవార్డు అందుకున్న తొలి భారతీయ ఉపాధ్యాయుడు రంజిత్‌సిన్హ్ డిసాలేను సలహాదారుగా ప్రపంచ బ్యాంకు నియమించింది. బ్యాంకు ప్రపంచవ్యాప్తంగా 12 మంది సలహాదారులను నియమించింది.
- భారత నావికాదళానికి చీఫ్ ఆఫ్ మెటీరియల్‌గా వైస్ అడ్మిరల్ సందీప్ నైతాని, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్, 2021 జూన్ 1న బాధ్యతలు స్వీకరించారు.

- **ఎన్‌బీసీసీ(ఇండియా) లిమిటెడ్‌లో ఖాళీలు**

మొత్తం పోస్టుల సంఖ్య: 07

పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హెచ్ఆర్ఎం) – 05, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ –02.

మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హెచ్ఆర్ఎం):
వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 29 ఏళ్లు మించకుండా ఉండాలి.
వేతనం: నెలకు రూ.40,000 నుంచి 1,40,000 చెల్లిస్తారు.
జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్:
వయసు: దరఖాస్తు చివరి తేది నాటికి 27ఏళ్లు మించకుండా ఉండాలి.
వేతనం నెలకు రూ.24,640 చెల్లిస్తారు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 21.06.2021

పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.nbccindia.com



కవిత

# నేనేమన్నానని?

నేనేమన్నానని అంతకోపం
కష్టంలో ఉన్న పొరుగువానిని
నిన్నువలె ప్రేమించకపోయినా
కాస్త జాలి చూపమన్నా!

తెగులు బారిన పడిన వానిని
కులమత బేధం లేకుండా
క్రీస్తు స్పర్శతో
కాస్త పరామర్శించమన్నా!

ఆక్సిజన్ అందక అరులుచాస్తున్న
సహమానవునికి
మంచి సమరయునిలా
కాస్త సాయం చేయమన్నా!

తెగులు ద్వారా మరణం దరిచేరకుండా
భౌతిక దూరం పాటించి
మనసు ద్వారా
ఇతరులకు కాస్త దగ్గరవ్వమన్నా!

ఈ తెగలు ఆపటం
నీ వల్ల కాదు నా వల్ల కాదు
సమస్తం చేయగల యేసయ్యను
ప్రార్థనలో వేడుకోమన్నా!

నిర్లక్ష్యం చేసే వానిని
మందలించమన్నా
అవసరంలోనున్న వానికిచ్చేప్పుడు
జేబు తడుము కోవద్దన్నా!

ముసుకు లేని మనసుతో
మాస్క్ కలిగిన ముఖంతో
మానవత్వానికి
మాదిరి కమ్మన్నా!



మాటలతో మాత్రమే గాక
చేతలలో కూడా ప్రేమించమన్నా
నన్ను కూడా ప్రేమించేవారున్నారన్న
భరోసా కల్పించమన్నా!

కనిపించే పొరుగువాని ప్రేమించలేనివాడు
కనిపించని దేవుని ఎలా ప్రేమిస్తాడన్నా?
మానవాళి కొరకు సమస్తమిచ్చి
ప్రాణం పెట్టిన యేసయ్యను అనుసరిద్దామన్నా!

**శ్రీనివాస్ శీలం (రక్షణ్),** కొత్తగూడెం సీనియర్ అడ్వైజర్‌గా ఉంటున్నారు. 2020 వరకు ఆంగ్ల బోధకునిగా పనిచేసారు. 2021 నుండి పూర్తికాల పరిచర్యలో ఉన్నారు

# TREASURER'S REPORT

## కోశాధికారి కలం నుండి.....

"... ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" (మత్తయి 10:8).

ప్రియమైన యు.ఇ.యస్.ఐ-టి.యస్ సభ్యులకు ప్రభు క్రీస్తు నామంలో శుభములు.

కోవిడ్-19 సెకండ్ వేవ్ నన్ను కూడా తాకినప్పుడు నాలో మొదలైన ముఖ్యమైన ప్రశ్న "నా జీవిత సమయం ఇంకా 15 రోజులేనా? లేక పొడిగించబడుతుందా?" అని రోజులు లెక్కపెట్టుకోవడం మొదలు పెట్టాను. దేవుని అద్భుతమైన కృపను బట్టి ఇప్పటికీ సజీవుల లెక్కలోనే ఉన్నాను! అందుకు ఆయనను ఎంతగానో స్తుతిస్తున్నాను మరియు ఎడతెగక ప్రార్థించిన మీ అందరికీ హృదయపూర్వక వందనాలు తెలియజేస్తున్నాను.

యేసయ్య తన శిష్యులను పంపుచూ చెప్పిన మాటలు "రోగులను స్వస్థపరచుడి, చనిపోయినవారిని లేపుడి, కుష్ఠరోగులను శుద్ధులనుగా చేయుడి, దయ్యములను వెళ్లగొట్టుడి. ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" (మత్తయి 10:8). మన జీవితంలో మనం కలిగివున్నది ఏదైనా... అది ఆయన కృప వలననే ఉచితంగా పొందామని మర్చిపోకూడదు. ఉద్యోగం చేసో, తెలివితేటలను ఉపయోగించో కష్టపడి సంపాదించుకున్నామని అనుకుంటాం గాని అన్నిటికంటే ముఖ్యమైనది మనలో ఉన్న జీవం ఆయన ఉచితమైన కృపయేనని కోవిడ్ వచ్చి తగ్గిన వారికి బాగా అర్థమవుతుంది. కాబట్టి మన జీవితాలలో మనకు ఇవ్వబడిన వాటి పట్ల "ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" అనే ఆయన ఆజ్ఞను అమలుపరచుదాం. మన తోటివారితో పంచుకోవలసిన ముఖ్య ఘడియలు ఇవేనని గుర్తుపెట్టుకొని ముందుకు సాగాలని ప్రార్థిస్తున్నాను.

మనకందరికీ తెలిసినట్లుగా మన ప్రియమైన స్టాఫ్ బ్రదర్ ప్రభాకర్ గారి కుటుంబంలో చోటు చేసుకున్న సంఘటనను బట్టి ప్రార్థిద్దాం, ఎగ్జిక్యూటివ్ కమిటీ వారు అభ్యర్థించిన విధంగా వారి ఇద్దరి కుమార్తెలకు బ్యాంకులో ఫిక్స్డ్ డిపాజిట్ చేయటానికి అవసరమైన రూ.4,00,000 కొరకు మన అనుదిన ప్రార్థనలో గుర్తు చేసుకుంటూ దేవుడు ప్రేరేపించిన దాన్ని బట్టి పాలుపంచుకుందాం.

**స్తుతించండి**

1. స్టాఫ్‌కు సకాలంలో 100% జీతములు ఇవ్వగలిగిన దాన్ని బట్టి
2. కోవిడ్-19 24/7 హెల్ప్ లైన్ సపోర్ట్‌కు అవసరమైన రూ.3,00,000 సమకూర్చబడిన దాన్ని బట్టి

**ప్రార్థించండి**

1. ప్రతి నెల బడ్జెట్ రూ.7.7 లక్షల కొరకు (పెరిగే అవకాశమున్నది)
2. 2020-21 ఆర్థిక సంవత్సరం అకౌంట్స్ ఆడిటింగ్ జరుగులాగున
3. రీనా మరియు రూబీలకు భవిష్యత్తులో అవసరానికి సహాయపడు రూ.4,00,000 కొరకు
4. స్టాఫ్ హెల్త్ ఇన్సూరెన్సు సంవత్సరపు రెన్యువల్‌కు అవసరమైన రూ 75,000 కొరకు
5. స్టేట్ ఆఫీస్‌కు కావలసిన వసతుల గురించి
6. స్టడీ సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేయడానికి
7. 100 కె.వి.ఎ ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్ పనులు సకాలంలో పూర్తవులాగున

**ప్రశ్న:** నూతన స్టాఫ్‌ను తీసుకున్న దానిని బట్టి ఆర్థిక అవసరత ఎంత పెరగవచ్చు?

**జవాబు:** నెలకు సుమారు రూ.60,000 అదనంగా అవసరం అవుతుంది. కాబట్టి అన్ని ఇ.జి.యఫ్‌లు గమనించవలసినదిగా మనవి.


ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
డి.అనీల్ కుమార్

| UESI - TS MONTHLY REQUIREMENT - Rs. 7.7 Lacs. | | | |
|---|---|---|---|
| May-21 | | | |
| **RECEIPTS** | **Rs.** | **PAYMENTS** | **Rs.** |
| General Contribution | 5,95,256.00 | Field Staff Salaries | 4,33,491.28 |
| Staff Support | 76,000.00 | Office Staff Salaries | 1,07,779.44 |
| | | Gratuity Fund | 16,179.00 |
| | | Repairs & Maintenance | 16,593.60 |
| | | UESI | 25,000.00 |
| | | NEGF | 3,000.00 |
| | | Bihar State Support | 16,000.00 |
| | | Previous month deficit | 11,841.20 |
| | | SWF | 41,371.48 |
| **Total** | **6,71,256.00** | **Total** | **6,71,256.00** |
| | | | - |
| **UESI (Support from EGF's)** | **2,28,400.00** | **UESI** | **2,28,400.00** |

# జూన్ '21 పజిల్
# గలతీయులకు (4-6 అధ్యాయాలు)

**అడ్డం**

4. వారసుడు వీరి వద్ద ఉండవలెనని చెప్పబడింది
5. యేసు క్రీస్తు సిలువ యందు ఇది చేస్తే, లోకముకు – మనకు, మనకు లోకమునకు సిలువ వేయబడుతుంది
6. శరీర ప్రకారం పుట్టిన వాడు – దాసి కుమారుడైతే స్వతంత్రురాలికి పుట్టిన కుమారుడు దేని వలన పుట్టెను?
7. మనం ఏమి కావలెనని దేవుడు ధర్మశాస్త్రమునకు లోబడెను
12. తగిన శిక్షను భరించువాడెవడు?
13. 4:27లో ఉన్న ప్రవచన వాక్యం వున్న గ్రంధంలో ఉన్నది?
14. ఇవి చేసినట్లయితే దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనలేరు




**నిలువు**

1. కలవరపెట్టువాడు ఏమి చేసుకుంటే మేలు?
2. శరీర కార్యాల్లో మొదట చెప్పబడింది.
3. మరల ఎటువైపు తిరిగారని పౌలు గలతీయ సంఘస్థుల విషయమై భయపడుచున్నాడు?
8. ఆత్మ ఫలములలో చివరగా చెప్పబడింది (క్రింద నుండి)
9. ఎవడైనను తప్పిపోతే, ఈ మనస్సుతో అతన్ని మంచి దారికి తీసుకొని రావలెను?
10. ఎలాంటి పరిస్థితులలో పౌలు గలతీయులకు సువార్త మొదటిసారి ప్రకటించాడు?
11. స్వతంత్రముగా ఉన్న ఈ పట్టణం మనకు తల్లి

– వినోద నాగిరెడ్డి, ఫ్యాకల్టీ ఇన్ హిస్టరీ,
తారా ప్రభుత్వ కళాశాల (ఎ), సంగారెడ్డి

# మే '21 పజిల్ జవాబులు
# గలతీయులకు (1-3 అధ్యాయాలు)




**విజేతలు**

1. పి. రాణి జగదీష్, మిర్యాలగూడ
2. మహేశ్వరి, కంబాలపల్లి
3. యం. ప్రియాంక, కొండమల్లేపల్లి

Edited Printed and Published by Mr. Sudhir Kumar Gaddam for UESI-TS Publication Trust,
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at Marvellous Printers, Nallakunta, Hyderabad.